


# నేటి శుభోదయ

ప్రతి క్షణం - ప్రజల కోసం

తెలుగు దినపత్రిక




ప్రచురణ : హైదరాబాద్, రంగారెడ్డి, సంపుటి 01, సంచిక 180, సంపాదకులు : గోంగూర శ్రీనివాసరావు, పేజీలు -8 శుక్రవారం - 20 - సెప్టెంబర్ - 2024 , వెల రూ.2/-

## రష్యా ఆయుధాగారాలపై ఉక్రెయిన్ భీకర దాడి

భారీ పేలుళ్లతో ఆ ప్రాంతం దద్దరిల్లింది

టోరోపెట్స్‌లో ఉన్న రష్యా ఆయుధ గిడ్డంగులను ధ్వంసం చేశాం

ఉక్రెయిన్ డ్రోన్ల దాడులతో మిస్సైళ్లు పేలిపోయి 6 కిలోమీటర్ల ప్రాంతమంతా మంటలు


2

## ప్రశాంతంగా తొలి దశ ఎన్నికలు

జమ్ము, కశ్మీర్‌లో 59% పోలింగ్

తొలిసారిగా జరుగుతోన్న అసెంబ్లీ ఎన్నికల్లో తొలి దశ ఎన్నికలు

సెప్టెంబరు 25, అక్టోబరు ఒకటవ తేదీన మరో రెండు దశల్లో పోలింగ్

అక్టోబరు 8న ఓట్ల లెక్కింపు



2

'చంద్రయాన్-4'కు ఆమోదం తెలియజేసిన కేంద్ర కేబినెట్

## అంతరిక్షంలో మన జైత్రయాత్ర

ప్రభుత్వం రూ.2,104.06 కోట్లు ఖర్చు

చంద్రయాన్-4 స్పేస్‌క్రాఫ్ట్ అభివృద్ధి, లాంచింగ్ బాధ్యతను ఇస్రోకు



2

## తెలంగాణ తలసరి ఆదాయం 193.6 శాతం


2లో

- తెలంగాణ.. సంపన్న రాష్ట్రం!
- జాతీయ సగటు కంటే ఎక్కువ తలసరి
- తర్వాత కర్ణాటక, తమిళనాడు, కేరళ
- దేశ జీడీపీలో 30 దక్షిణాది రాష్ట్రాల నుంచే..
- ప్రధానమంత్రి ఆర్థిక సలహా మండలి నివేదిక

# సీఎం రేవంత్ రెడ్డి.. మూసీ నదిపై ప్రత్యేక ఫోకస్

## మూసీ నదిపై హైడ్రా ఫోకస్..

- నోటీసులు.. వీకెండ్‌లో కూల్చివేతలు
- 400 ఏళ్ల కిందట మూసీ నది.. భాగ్యనగరానికి ఒక వరం
- నార్సింగి-నాగోల్ మధ్య ఏకంగా 12 వేల ఆక్రమణలు
- మూసీని అందంగా తీర్చిదిద్ది.. ప్రపంచ దేశాలను ఆకర్షించేలా చేస్తా




హైదరాబాద్: మూసీ నది అంటే.. మనకు మురికి కాలువ గుర్తొస్తుంది. కానీ 400 ఏళ్ల కిందట మూసీ నది.. భాగ్యనగరానికి ఒక వరంలా ఉండేది. నీటి కొరత ఉండేది కాదు. స్వచ్ఛమైన మంచినీరు ఆ నదిలో లభించేది. మరి ఇప్పుడో.. నది చుట్టూ ఆక్రమణలే. అసలు నది సైజ్ పూర్తిగా మార్చేశారు. నార్సింగి-నాగోల్ మధ్య ఏకంగా 12 వేల ఆక్రమణలు జరిగినట్లు హైడ్రా తేల్చింది. ఇక ఎందుకు ఊరుకుంటుంది? ప్రక్షాళన మొదలుపెట్టింది. గురువారం నుంచి అక్రమాలపై నోటీసులు పంపనుంది. తర్వాత వీకెండ్‌లో కూల్చివేతలు ఉంటాయి. మీకు తెలుసుగా సీఎం రేవంత్ రెడ్డి.. మూసీ నదిపై ప్రత్యేక ఫోకస్ పెట్టారు. మూసీని అందంగా తీర్చిదిద్ది.. ప్రపంచ దేశాలను ఆకర్షించేలా చేస్తామన్నారు. దీనిపై ఆయన స్పెషల్ ఆసక్తి చూపిస్తున్నారు. విదేశీ బృందాలతో కూడా దీనిపై చర్చించారు. కాబట్టి.. ఆయన వెనక్కి తగ్గే ప్రసక్తే ఉండదు. మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఏర్పాటు చెయ్యడానికి కూడా రెడీ అవుతున్నారు. వారం నుంచి హైడ్రా అధికారులు.. మూసీ నది ఆక్రమణలపై సర్వే చేశారు. మిగతా..2లో


2

## కేసీఆర్ చరిత్రను చెరిపేయాలనుకోవడం భ్రమే

దాచేస్తే దాగని ప్రగతి

టీఎస్-ఐపాస్‌తో రాష్ట్ర పారిశ్రామికం పరుగులు

కాంగ్రెస్ సర్కార్ లెక్కలే నిదర్శనం

బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

హైదరాబాద్: పదేండ్ల కేసీఆర్ పరిపాలనలో సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల అభివృద్ధి పరుగులు పెట్టిందని బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. అది తాను చెబుతున్నది కాదని స్వయంగా కాంగ్రెస్ ప్రభుత్వమే అధికారికంగా మిగతా..2లో

## చంద్రబాబు దేనికీ భయపడరు


2లో

విపక్షంలో ఉన్న సమయంలోనూ ఆయన కళ్లలో భయం కనిపించలేదు

అక్రమ కేసులో అరెస్టయి జైల్లో ఉన్న సమయంలో చంద్రబాబు గుండె ధైర్యాన్ని చూశా

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 100 రోజులు

మూడు పార్టీల ఎమ్మెల్యేలతో సమావేశమైన సీఎం చంద్రబాబు

# ఇసుక రవాణాలో ఎమ్మెల్యేలు జోక్యం చేసుకోవద్దు

## వలంటీర్లు-సచివాలయాలపై ఏపీ సర్కారు సంచలన నిర్ణయం

- కూటమి ఎమ్మెల్యేలకు సీఎం చంద్రబాబు సున్నిత హెచ్చరిక ..ఎందుకంటే..!
- మంగళగిరిలో ఎన్డీఏ శాసనసభాపక్ష సమావేశంలో ఎమ్మెల్యేలకు చంద్రబాబు హిత బోధ
- ఉచిత ఇసుక విధానం విజయవంతం అయ్యేందుకు సహకరించాలి




అమరావతి: కూటమి నేతలకు సీఎం చంద్రబాబు సున్నిత హెచ్చరిక జారీ చేశారు. మంగళగిరిలో బుధవారం ఎన్డీఏ శాసనసభాపక్ష సమావేశంలో చంద్రబాబు మాట్లాడారు. ఇసుకలో జోక్యం చేసుకోవద్దని ఎమ్మెల్యేలకు సూచించారు. ఉచిత ఇసుక విధానంపై ప్రతిపక్షం నుండి విమర్శలు వస్తున్న నేపథ్యంలో చంద్రబాబు చేసిన కామెంట్స్ ప్రాధాన్యతను సంతరించుకున్నాయి. ఉచిత ఇసుక విషయంలో జోక్యం చేసుకుంటే చర్యలు తప్పవని పరోక్షంగా చంద్రబాబు హెచ్చరించారు. గత ప్రభుత్వ హయాంలో చేసిన తప్పిదాలపై ఇప్పటికే విచారణ జరుగుతోందని అన్నారు. నియోజకవర్గాల్లో ఇసుక విషయంలో జోక్యం చేసుకోకుంటే రాబోయే రోజుల్లో మన గెలుపునకు అదే దోహదం చేస్తుందన్నారు. కూటమి ఎమ్మెల్యేలు ఉచిత ఇసుక విధానం జయప్రదం చేసేలా సహకరించాలని చంద్రబాబు కోరారు. ఇదే సందర్భంలో అమరావతి రాజధాని నిర్మాణం, పోలవరం ప్రాజెక్టు తదితర విషయాలపైనా ప్రసంగించారు. మిగతా..2లో

## రాష్ట్రంలోని 8 లక్షల హెక్టార్లలో వరద ముంపు



- వరద ముంపులో ఏపీకి ఆరో స్థానం
- దక్షిణాది రాష్ట్రాల్లో తొలి స్థానం
- కృష్ణా, గోదావరి నదుల నుంచి ఏపీకి పదేపదే వరద ముప్పు
- నేషనల్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ అథారిటీ వెల్లడి

అమరావతి: దేశంలో వరదలు, తుపాన్ల వల్ల ముంపునకు గురవుతున్న రాష్ట్రాల్లో.. ఆంధ్రప్రదేశ్ ఆరో స్థానంలో నిలిచింది. దక్షిణాది రాష్ట్రాల్లో ఏకంగా మొదటి స్థానంలో నిలిచిందని నేషనల్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ అథారిటీ, జాతీయ రిమోట్ సెన్సింగ్ సెంటర్ వెల్లడించింది. 1998 నుంచి 2022 వరకు వివిధ రాష్ట్రాల్లో సంభవించిన వరదలు, తుపాన్ల వల్ల జరిగిన మిగతా..2లో

## అన్ని ఎన్నికలకూ ఒకే ఓటరు కార్డు

# ఒకే ఓటరు జాబితా

జమిలి అమలైతే.. తొలుత లోక్‌సభ, శాసనసభలకు ఒకేసారి ఎన్నికలు




న్యూఢిల్లీ: జమిలి ఎన్నికలపై మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ కమిటీ సమర్పించిన నివేదికను కేంద్ర క్యాబినెట్ గురువారం ఆమోదించడంతో.. ఈ అంశంపై మరోసారి దేశవ్యాప్తంగా చర్చ మొదలైంది. 2029లో జమిలి ఎన్నికలు నిర్వహించాలంటే అందుకు తగిన సన్నాహాలు ఇప్పటి నుంచే జరపాలని భావిస్తున్నమోదీ ప్రభుత్వం.. శీతాకాల సమావేశాల్లోనే ఈ మేరకు బిల్లును ప్రవేశపెట్టాలని నిర్ణయించింది. కొత్త విధానం ప్రకారం.. ఒక ప్రభుత్వం ఏర్పడిన రెండేళ్లలోనే పడిపోయి, ఎన్నికలు జరపాల్సి వస్తే.. అప్పుడు ఏర్పడే ప్రభుత్వం అయిదేళ్లలో మిగిలిన మూడేళ్ల కాలం వరకే కొనసాగుతుంది. దీనివల్ల అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టడంపై ప్రతిపక్షాలకు అంత ఆసక్తి ఉండదని రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి. కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ తెలిపిన వివరాల ప్రకారం.. జమిలి ఎన్నికలు మిగతా..2లో


## మొదటిసారి వచ్చాను కాబట్టి సున్నితంగా చెబుతున్నాను


2లో

- రాజన్న సిరిసిల్ల జిల్లాలోని ఏకలవ్య మోడల్ స్కూల్‌ను సందర్శించిన సంజయ్
- భోజనం, టాయిలెట్లపై ఫిర్యాదు చేసిన విద్యార్థులు
- మన పిల్లలకు ఇలాంటి భోజనమే పెడతామా? అని బండి సంజయ్ నిలదీత

## తిరుమల లడ్డూ ప్రసాదంపై టీడీపీ, వైసీపీ నీచ రాజకీయాలు

- తిరుమల శ్రీవారి ప్రసాద లడ్డూపై తీవ్ర రాజకీయ దుమారం
- లడ్డూ తయారీకి జంతువుల నూనెలు వాడారన్న సీఎం చంద్రబాబు
- చంద్రబాబు వ్యాఖ్యలను ఖండించిన ఏపీ పీసీసీ చీఫ్ వైఎస్ షర్మిల
- సీఎం వ్యాఖ్యలు తిరుమల పవిత్రత, ప్రతిష్ఠకు భంగం కలిగించేలా ఉన్నాయి



తిరుపతి: తిరుమల శ్రీవెంకటేశ్వరుడి ప్రసాదం లడ్డూపై తీవ్ర రాజకీయ దుమారం నడుస్తోంది. ఈ పవిత్రమైన లడ్డూ ప్రసాదం తయారీకి జంతువుల నూనెలు వాడారని స్వయంగా సీఎం చంద్రబాబు నాయుడు ఆరోపణలు చేయడం కలకలం రేపింది. మిగతా..2లో

## రష్యా ఆయుధాగారాలపై ఉక్రెయిన్ భీకర దాడి

కీవ్: రష్యాకు చెందిన కీలక ఆయుధాగారాలపై ఉక్రెయిన్ డ్రోన్‌లతో విరుచుకుపడింది. మిస్సైళ్లు, ఇతర ఆయుధాలను ధ్వంసం చేసింది. సరిహద్దు నుంచి 500 కిలోమీటర్ల దూరంలోని ఆయుధ గిడ్డంగులపై ఉక్రెయిన్ మంగళవారం రాత్రి వందకు పైగా డ్రోన్లను ప్రయోగించి వాటిని నేలమట్టం చేసింది. భారీ పేలుళ్లతో ఆ ప్రాంతం దద్దరిల్లింది. టోరోపెట్స్‌లో ఉన్న రష్యా ఆయుధ గిడ్డంగులను ధ్వంసం చేశామని ఉక్రెయిన్ ప్రకటించింది. మాస్కోకు 380 కిలోమీటర్ల దూరంలో టోరోపెట్స్ ఉంది. ఉక్రెయిన్ సెక్యూరిటీ సర్వీసెస్, ఉక్రెయిన్ ఇంటలిజెన్స్ అండ్ స్పెషల్ ఆపరేషన్ ఫోర్సెస్ కలిపి సంయుక్తంగా ఈ భీకర దాడిని చేపట్టాయి. స్వదేశీ తయారీ కామికేజ్ డ్రోన్లను ఉక్రెయిన్ ఈ దాడికి వాడింది. ఇస్కాందర్, టోచ్కా-యు మిస్సైళ్లు, గ్లైడ్ బాంబులు, ఇతర మందుగుండు సామాగ్రి ఈ గిడ్డంగుల్లో ఉందని ఉక్రెయిన్ అధికారులు తెలిపారు. ఉత్తరకొరియా సరఫరా చేసిన కేఎన్-23 స్వల్పశ్రేణి బాలిస్టిక్ మిస్సైళ్లు కూడా ఇందులో ఉన్నాయని చెప్పారు. భూకంపం వచ్చినంతటి తీవ్రతతో పేలుళ్లు జరిగాయని, పరిసర ప్రాంతాల్లోని ప్రజలను ఖాళీ చేయించారని రష్యా వార్తా సంస్థలు తెలిపాయి. టోరోపెట్స్‌లో 11 వేల జనాభా ఉంది. ఉక్రెయిన్ డ్రోన్ల దాడులతో మిస్సైళు పేలిపోయి 6 కిలోమీటర్ల ప్రాంతమంతా మంటలు వ్యాపించాయి.

## ప్రశాంతంగా తొలి దశ ఎన్నికలు

శ్రీనగర్/జమ్ము : జమ్ము, కశ్మీర్‌లో 2019లో ఆర్టికల్ 370 రద్దు తర్వాత తొలిసారిగా జరుగుతోన్న అసెంబ్లీ ఎన్నికల్లో తొలి దశ ఎన్నికలు బుధవారం ప్రశాంతంగా ముగిశాయి. 59 శాతం పోలింగ్ నమోదు కావడం విశేషం. జమ్ము, కశ్మీర్‌లో జరిగిన గత ఏడు లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికలతో పోల్చితే ఇదే అత్యధిక పోలింగ్ అని జమ్ము, కశ్మీర్ చీఫ్ ఎలక్టొరల్ ఆఫీసర్ పీకే పోలే తెలిపారు. పోస్టల్ బ్యాలెట్, మారుమూల ప్రాంతాల పోలింగ్ వివరాలు కూడా అందితే ఈ పోలింగ్ శాతం మరింత పెరగవచ్చని ఆయన చెప్పారు. బుధవారం ఉదయం ఏడు గంటలకు ప్రారంభమయిన పోలింగ్ రోజంతా స్థిరంగా కొనసాగింది. మహిళలు, పురుషులు, యువత, వృద్ధులు, నడవలేని వారు కూడా రాష్ట్రమంతటా పోలింగ్ బూత్‌ల వద్ద ఓపిగ్గా వేచిఉండడం కనిపించింది. ఈ రాష్ట్రంలోని మొత్తం 90 అసెంబ్లీ సీట్లకు తొలిదశలో 24 సీట్లకు ఎన్నికలు జరిగాయి. వాటిలో 16 కశ్మీర్ లోయలో ఉండగా... 8 జమ్ము ప్రాంతంలో ఉన్నాయి. మొత్తం 23 లక్షల మందికిపైగా ఓటర్లు ఈ ఎన్నికల్లో 219 మంది అభ్యర్థుల భవితవ్యం తేల్చనున్నారు. ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు భద్రతా దళాలతో విస్తృతంగా బందోబస్తు కల్పించారు. బిజ్‌బెహరా, డీహెచ్ పోరా వంటి ఒకటి రెండు చోట్ల రాజకీయ పార్టీల కార్యకర్తల మధ్య ఘర్షణలు తప్ప ఎక్కడా అవాంఛనీయ ఘటనలు జరగలేదు. సెప్టెంబరు 25, అక్టోబరు ఒకటవ తేదీన మరో రెండు దశల్లో పోలింగ్ జరగాల్సి ఉంది. అక్టోబరు 8న ఓట్ల లెక్కింపు జరుగుతుంది.

### మొదటిసారి వచ్చాను కాబట్టి
## సున్నితంగా చెబుతున్నాను

హైదరాబాద్: టాయిలెట్‌లో నీళ్లు లేకపోతే పట్టించుకోరా? మొదటిసారి వచ్చాను కాబట్టి సున్నితంగా చెబుతున్నాను... మరోసారి కూడా ఇలాగే చేస్తే మామూలుగా చెప్పబోనని కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ హెచ్చరించారు. ఆయన రాజన్న సిరిసిల్ల జిల్లా కోనరావుపేట మండలంలోని ఏకలవ్య మోడల్ స్కూల్‌ను సందర్శించారు. తరగతి గదిలోకి వెళ్లి విద్యార్థులతో ముచ్చటించారు. విద్యార్థులను వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అన్నంలో రాళ్లు వస్తున్నాయని, టాయిలెట్లు సరిగ్గా లేవని, నీళ్లు కూడా రావడం లేదని విద్యార్థులు ఫిర్యాదు చేశారు. అధికారులు, ఉపాధ్యాయులతో బండి సంజయ్ సమావేశం నిర్వహించారు. అన్నంలో రాళ్లు వస్తున్నాయని విద్యార్థులు చెబుతున్నారని, మన పిల్లలకు ఇలాంటి ఆహారం పెడతామా? అని నిలదీశారు. టాయిలెట్‌లు సరిగ్గా లేకుంటే పట్టించుకోకపోతే ఎలా? అని మండిపడ్డారు. తాను రెండోసారి వచ్చినప్పుడు కూడా ఇలాగే ఉంటే సున్నితంగా చెప్పేది ఉండదని స్పష్టం చేశారు.

టాయిలెట్ల నిర్మాణానికి శంకుస్థాపన

ప్రధాని మోదీ ఆదేశాల మేరకు ప్రతి ఎంపీ తన పరిధిలోని ఏకలవ్య పాఠశాలను సందర్శించి సమస్యలు తెలుకుంటున్నట్లు చెప్పారు. ఇందులో భాగంగా తానూ ఇక్కడకు వచ్చానన్నారు. దేశవ్యాప్తంగా 728 ఏకలవ్య పాఠశాలలు ఉన్నాయని, ఇప్పటి వరకు 410 పాఠశాలల్లో విద్యాబోధన కొనసాగుతోందన్నారు. దేశవ్యాప్తంగా ఏకలవ్య పాఠశాలల్లో 1.20 లక్షల మంది చదువుకుంటున్నట్లు చెప్పారు. తెలంగాణలోని 23 ఏకలవ్య పాఠశాలల్లో 8,300 మంది విద్యార్థులు చదువుకుంటున్నారని తెలిపారు.

## తెలంగాణ తలసరి ఆదాయం 193.6 శాతం

న్యూఢిల్లీ: దేశ జీడీపీలో దాదాపు 30 శాతం దక్షిణాది రాష్ట్రాల నుంచే వస్తోంది. 2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి జీడీపీలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, కేరళ, తమిళనాడు వాటా 30 శాతంగా ఉంది. ఈ విషయాలను ప్రధానమంత్రి ఆర్థిక సలహా మండలి తన తాజా నివేదికలో వెల్లడించింది. ఈ రాష్ట్రాల తలసరి ఆదాయం జాతీయ సగటు కంటే ఎక్కువగా ఉందని తెలిపింది. జాతీయ సగటులో తెలంగాణ తలసరి ఆదాయం 193.6 శాతం ఉండగా, కర్ణాటక 181 శాతం, తమిళనాడు 171 శాతం, కేరళ 152.5 శాతం మేర ఉందని వివరించింది. ఆర్థిక సరళీకరణ తర్వాత తెలంగాణ, కర్ణాటక బలమైన ఆర్థిక కేంద్రాలుగా మారాయని తెలిపింది. విభజన తర్వాత ఏపీ పరిస్థితి బాగా దెబ్బతిందని వెల్లడించింది. 2023-24లో తెలంగాణలో తలసరి ఆదాయం 193.6 శాతం మేర పెరగ్గా.. ఏపీలో 131.6 శాతానికి పడిపోయిందని తెలిపింది. తలసరి ఆదాయం విషయంలో ఢిల్లీ, తెలంగాణ, కర్ణాటక, హరియాణా తొలి నాలుగు స్థానాల్లో ఉన్నాయని పేర్కొంది. తెలంగాణలో సగటు వ్యక్తి జాతీయ సగటు కంటే 94 శాతం అధిక ఆదాయం ఆర్జిస్తుండగా.. కర్ణాటకలో 81 శాతం, తమిళనాడులో 71 శాతం ఆర్జిస్తున్నారని వివరించింది. తలసరి ఆదాయం రీత్యా ఢిల్లీ, తెలంగాణ, కర్ణాటక, హరియాణా సంపన్న రాష్ట్రాలుగా గుర్తింపు పొందగా, బిహార్, ఝార?ండ్, యూపీ, మణిపూర్, అసోం పేద రాష్ట్రాలుగా ఉన్నట్లు నివేదిలో తెలిపింది. పశ్చిమ రాష్ట్రాల్లో మహారాష్ట్ర, గుజరాత్ మంచి పనితీరు కనబర్చాయని, గోవా తలసరి ఆదాయం జాతీయ సగటు కంటే మూడు రెట్లు ఎక్కువగా ఉందని చెప్పింది. ఉత్తరాది రాష్ట్రాల్లో ఢిల్లీ, హరియాణా మంచి పనితీరు కనబర్చగా, పంజాబ్ తలసరి ఆదాయం తగ్గుతూ వస్తోందని తెలిపింది. తూర్పు రాష్ట్రాల్లో పశ్చిమ బెంగాల్ పరిస్థితి అధ్వానంగా ఉందని, 2023-24లో దాని వాటా జాతీయ జీడీపీలో కేవలం 5.6 శాతమని పేర్కొంది. తలసరి ఆదాయం విషయంలో ఒడిసా ఎంతో మెరుగుపడిందని, 2023-24లో 88.5 శాతానికి చేరుకుందని తెలిపింది. మధ్యప్రదేశ్ తలసరి ఆదాయం 2010-11లో 60.1 శాతం ఉండగా.. 2023-24లో 77.4 శాతానికి పెరిగిందని వివరించింది. అసోం తలసరి ఆదాయం క్రమంగా పెరుగుతూ 73.7 శాతానికి చేరుకోగా, సిక్కిం తలసరి ఆదాయం గత రెండు దశాబ్దాల్లో చెప్పుకోదగ్గ రీతిలో పెరిగిందని ప్రధాన మంత్రి ఆర్థిక సలహా మండలి ప్రశంసించింది.

## చంద్రబాబు దేనికీ భయపడరు

అమరావతి: ఏపీలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 100 రోజుల అయిన సందర్భంగా మంగళగిరి సీకే కన్వెన్షన్ సెంటర్ లో సీఎం చంద్రబాబు కూటమి ఎమ్మెల్యేలతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కూడా హాజరయ్యారు. ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ ప్రసంగిస్తూ... చంద్రబాబు సారథ్యంలో పనిచేయడం ఆనందం కలిగించే విషయం అని అన్నారు. చంద్రబాబులో తాను గమనించిన అంశం ఏమిటంటే, ఆయన దేనికీ భయపడే వ్యక్తి కాదని అన్నారు. విపక్షంలో ఉన్న సమయంలోనూ ఆయన కళ్లలో భయం కనిపించలేదని స్పష్టం చేశారు. అక్రమ కేసులో అరెస్టయి జైల్లో ఉన్న సమయంలో చంద్రబాబు గుండె ధైర్యాన్ని చూశానని తెలిపారు. జీవితంలో అనేక కష్టనష్టాలు ఎదుర్కొన్న వ్యక్తి చంద్రబాబు అని వివరించారు. ఆయన జైల్లో ఉన్నప్పుడు తాను షూటింగ్ లు కూడా మానేశానని, నిర్మాతలు అడిగినా రానని చెప్పానని పవన్ గుర్తుచేసుకున్నారు. చంద్రబాబు ఎంతగా కష్టపడి పనిచేస్తారో ఇటీవల వరదల సమయంలో చూశానని వెల్లడించారు. పాతికేళ్ల యువకుడిలా ఆయన శ్రమించిన తీరు అందరికీ స్ఫూర్తిదాయకమని అన్నారు. ఆయన స్వయంగా చేయడం ఎందుకు, అజమాయిషీ చేయవచ్చు కదా అని కొందరు అనుకోవచ్చు... కానీ క్షేత్రస్థాయిలో ఆయన పని చేయడం వల్ల ముఖ్యంగా అధికారులకు మార్గదర్శనం చేసినట్టయిందని, విపత్తు సమయాల్లో ఎలా పనిచేయాలో ఆయన ఒక దారి చూపించారని వివరించారు. ఒకరకమైన అలసత్వానికి లోనైన అధికారుల్లో చలనం తీసుకువచ్చారని చంద్రబాబుపై పవన్ కల్యాణ్ ప్రశంసల జల్లు కురిపించారు. చంద్రబాబు ఓపిక చూస్తే ఆశ్చర్యం కలుగుతుందని, అయితే వైసీపీ మాత్రం విమర్శలు చేస్తోందని వ్యాఖ్యానించారు. మంచి పనులు చేసే చంద్రబాబు వంటి వ్యక్తి అందరూ అండగా ఉండాలని పవన్ పిలుపునిచ్చారు.

## రాష్ట్రంలోని 8 లక్షల హెక్టార్లలో వరద ముంపు

మొదటి పేజి తరువాయి



నష్టాలను తెలియజేసింది. దేశంలో అత్యధికంగా బిహార్ రాష్ట్రంలో 39 లక్షల హెక్టార్లు, ఉత్తరప్రదేశ్‌లో 26 లక్షల హెక్టార్లు, అస్సాంలో 24 లక్షల హెక్టార్లు, పశ్చిమబెంగాల్‌లో 19 లక్షల హెక్టార్లు, ఒడిశాలో 14 లక్షల హెక్టార్లు, ఏపీలో 8 లక్షల హెక్టార్లలోని ప్రాంతాలు తుపాన్లు, వరదల వల్ల నీటమునిగాయని వెల్లడించింది. ఏపీలో అయితే బాపట్ల, నెల్లూరు జిల్లాలే అత్యధికంగా నీట మునిగాయని తెలిపింది. నెల్లూరు జిల్లాలో 1.4 లక్షల హెక్టార్లు, బాపట్ల జిల్లాలో 1.11 లక్షల హెక్టార్ల భూమి ముంపునకు గురైందని పేర్కొంది.

ఈ నదులపై తీవ్ర ప్రభావం

ఎడతెగని వర్షాలతో పాటు ఆక్రమణలు, డ్రైనేజీ వ్యవస్థల నిర్వీర్యం, ప్రతికూల వాతావరణం, మారుతున్న భూ వినియోగ విధానాలు, పెరుగుతున్న జనాభా తదితరాల వల్లే వరదలు సంభవిస్తున్నాయని తెలిపింది. గడిచిన 25 ఏళ్లలో భారీ వర్షాల వల్ల గోదావరి, కృష్ణా, వంశధార, నాగావళి నదుల్లో ప్రవాహం పెరిగి.. తరుచూ వరదలు సంభవిస్తున్నాయని పేర్కొంది. రుతుపవనాలు, అల్పపీడనాలు కూడా ఏపీలో వరదలకు దోహదం చేస్తున్నాయని తెలిటంది.

తీవ్ర విషాదం మిగిల్చిన దివిసీమ ఉప్పెన

1977లో సంభవించిన దివిసీమ(కృష్ణాజిల్లా) ఉప్పెన తీవ్ర విషాదాన్ని మిగిల్చిం0ది. వేలాది మంది ప్రాణాలు కోల్పోయారు. ఈ ఉప్పెన.. అంతర్జాతీయ దాత ల దృష్టిని సైతం ఆకర్షించిందని నివేదిక వెల్లడించింది. 1979, 1990, 1996 తుపానులు కూడా ఇలాంటివేనని.. అవన్నీ మరిచిపోయే తుపానులు కాదని జాతీయ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ అథారిటీ పేర్కొంది.

# 'చంద్రయాన్-4'కు ఆమోదం తెలియజేసిన కేంద్ర కేబినెట్

న్యూఢిల్లీ: భారత అంతరిక్ష పరిశోధనల్లో మరో ముందడుగు పడింది. అంతరిక్ష రంగంలో భారత్ జైత్రయాత్రకు మార్గం సుగమమైంది. ఈ దిశగా పలు కీలక కార్యక్రమాలకు కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. చందమామపైకి భారత వ్యోమగాములను పంపించి, అక్కడ నమూనాలు సేకరించి, క్షేమంగా వెనక్కి తీసుకురావడానికి ఉద్దేశించిన చంద్రయాన్-4 మిషన్‌కు ఆమోద ముద్రవేసింది. వ్యోమగాములను పంపించడానికి అవసరమైన సాంకేతికత పరిజ్ఞానాన్ని, వ్యూహాలను ఈ కార్యక్రమంలో భాగంగా అభివృద్ధి చేస్తారు. ఇందుకోసం ప్రభుత్వం రూ.2,104.06 కోట్లు ఖర్చు చేయబోతోంది. చంద్రయాన్-4 స్పేస్‌క్రాఫ్ట్ అభివృద్ధి, లాంచింగ్ బాధ్యతను ఇస్రోకు అప్పగించబోతున్నారు. ఈ నూతన మిషన్‌కు పూర్తిగా దేశీయంగా అభివృద్ధి చేసిన టెక్నాలజీనే ఉపయోగించనున్నారు. చంద్రయాన్-3 ప్రయోగం విజయవంతం కావడంతో చంద్రయాన్-4ను ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా భావిస్తోంది. అంతరిక్షంలో సొంతంగా 'భారతీయ అంతరిక్ష కేంద్రం' నిర్మించుకోవడంతోపాటు 2040 నాటికి వ్యోమగాములను చంద్రుడిపైకి పంపించాలని భారత్ లక్ష్యంగా నిర్దేశించుకుంది. ఇందులో భాగంగానే చంద్రయాన్-4కు శ్రీకారం చుడుతోంది. ఈ మిషన్‌లో భారతీయ పరిశ్రమలను, విద్యా సంస్థలను భాగస్వాములను చేస్తారు.

ఎన్‌జీఎల్‌వీ సూర్య

పాక్షిక పునర్వినియోగ తదుపరి తరం లాంచ్ వెహికల్(ఎన్‌జీఎల్‌వీ) 'సూర్య' అభివృద్ధికి సైతం కేబినెట్ ఆమోదం తెలిపింది. ఇస్రో లాంచ్ వెహికల్ మార్క్-3 కంటే మూడు రెట్లు అధికంగా పేలోడ్‌ను ఇది మోసుకెళ్లగలదు. మార్క్-3తో పోలిస్తే ఖర్చు మాత్రం కేవలం 50 శాతమే పెరుగుతుంది. ఎన్‌జీఎల్‌వీ 'సూర్య' అభివృద్ధికి ప్రభుత్వం రూ.8,240 కోట్లు కేటాయించింది. గగన్‌యాన్ కార్యక్రమాన్ని మరింత విస్తరింపజేస్తూ భారతీయ అంతరిక్ష స్టేషన్‌లో మొదటి మాడ్యూల్(బీఏఎస్-1) అభివృద్ధికి కేబినెట్ పచ్చజెండా ఊపింది. గగన్‌యాన్‌లో భాగంగా 2028 డిసెంబర్ నాటికి ఎనిమిది మిషన్లు పూర్తిజేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. గగన్‌యాన్‌కు రూ.20,193 కోట్లు కేటాయించింది. కార్యక్రమ విస్తరణ కోసం అదనంగా రూ.11,170 కోట్లు కేటాయించింది. బయోటెక్నాలజీ రీసెర్చ్ ఇన్నోవేషన్, ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ డెవలప్‌మెంట్(బయో-రైడ్) పథకానికి మంత్రివర్గం ఆమోదం తెలియజేసింది. బయో టెక్నాలజీ రంగంలో పరిశోధనలు, అభివృద్ధికి ఈ పథకం తోడ్పాటు అందించనుంది. ఈ పథకం అమలుకు రూ.9,197 కోట్లు కేటాయించారు. యానిమేషన్, విజువల్ ఎఫెక్ట్స్, గేమింగ్, కామిక్స్, ఎక్స్‌టెండెడ్ రియాలిటీ రంగాల్లో నేషనల్ సెంటర్ ఫర్ ఎక్సలెన్స్(ఎన్‌సీఓఈ) ఏర్పాటు ప్రతిపాదనకు కేబినెట్ అంగీకారం తెలిపింది. ఈ సెంటర్ ఫర్ ఎక్సలెన్స్ ద్వారా ఇండియాను కంటెంట్ హబ్‌గా మార్చాలని ప్రభుత్వం భావిస్తోంది. 2024-25 రబీ సీజన్‌లో ఫాస్ఫేట్, పొటాష్ ఎరువులపై రూ.24,474.53 కోట్ల రాయితీ ఇచ్చేందుకు కేబినెట్ సుముఖత వ్యక్తంచేసింది. ఈ రాయితీ వల్ల సాగు వ్యయం తగ్గుతుందని, రైతులకు భరోసా లభిస్తుందని ప్రధాని నరేంద్ర మోదీ పేర్కొన్నారు. రైతన్నలకు కొరత లేకుండా నిరంతరాయంగా ఎరువులను అందుబాటులో ఉంచనున్నట్లు తెలిపారు. ప్రధానమంత్రి అన్నదాత ఆయ్ సంరక్షణ్ అభియాన్(పీఎం-ఆశా)కు కేబినెట్ నుంచి ఆమోదం లభించింది. రైతులకు తగిన మద్దతు ధర అందించడంతోపాటు మార్కెట్‌లో నిత్యావసరాల ధరలను నియంత్రించడానికి 2025-26లో రూ.35,000 కోట్లతో ఈ పథకం అమలు చేస్తారు. పీఎం-ఆశాతో రైతులతోపాటు వినియోగదారులకు సైతం లబ్ధి చేకూరుతుందని ప్రధాని మోదీ స్పష్టంచేశారు. దేశవ్యాప్తంగా గిరిజన వర్గాల సామాజిక-ఆర్థిక స్థితిగతులను మెరుగుపర్చడమే లక్ష్యంగా 'ప్రధానమంత్రి జనజాతీయ ఉన్నత్ గ్రామ్ అభియాన్'కు మంత్రివర్గం ఆమోదం తెలియజేసింది. ఈ పథకానికి రూ.79,156 కోట్లు కేటాయించారు.

### 'వీనస్ ఆర్బిటార్ మిషన్'

శుక్ర గ్రహంపై మరిన్ని పరిశోధనలకు గాను 'వీనస్ ఆర్బిటార్ మిషన్' అభివృద్ధికి కేంద్ర కేబినెట్ అంగీకారం తెలిపింది. డిపార్టుమెంట్ ఆఫ్ స్పేస్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం అమలు చేస్తారు. శుక్ర గ్రహం కక్ష్యలోకి సైంటిఫిక్ స్పేస్‌క్రాఫ్ట్ పంపించాలని నిర్ణయించారు. 'వీనస్ ఆర్బిటార్ మిషన్'కు కేంద్ర కేబినెట్ రూ.1,236 కోట్లు కేటాయించింది. ఇందులో రూ.824 కోట్లతో స్పేస్‌క్రాఫ్ట్‌ను అభివృద్ధి చేస్తారు.

# ఇసుక రవాణాలో ఎమ్మెల్యేలు జోక్యం చేసుకోవద్దు

మొదటి పేజి తరువాయి

కొత్త మద్యం పాలసీ తీసుకువస్తున్నామని, నాణ్యమైన మద్యాన్ని రూ.99లకే ఇస్తామని తెలిపారు. అమరావతికి కేంద్రం రూ 15 వేల కోట్లు ఇస్తోందని, ఇంకా మరిన్ని నిధులకు హామీ ఇచ్చారని చెప్పారు. అమరావతికి నిధుల కొరత లేదని చంద్రబాబు స్పష్టం చేశారు. పోలవరం ప్రాజెక్టును పూర్తి చేసి జాతికి అంకితం చేయాలన్నారు. గత ప్రభుత్వం చేసిన తప్పులతో పాటు మనం చేస్తున్న మంచి పనులను కూడా ప్రజల్లోకి తీసుకువెళ్లాలని ఎమ్మెల్యేలకు చంద్రబాబు సూచించారు.

వలంటీర్లు-సచివాలయాలపై ఏపీ సర్కారు సంచలన నిర్ణయం

రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం తీసుకువచ్చిన రెండు కీలక వ్యవస్థలను ప్రభుత్వ శాఖల్లో కలిపేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. జగన్ హయాంలో వలంటీర్ల వ్యవస్థను తీసుకువచ్చిన విషయం తెలిసిందే. అయితే.. ఎన్నికల సమయంలో ఈ వ్యవహా రం వివాదంగా మారింది. దీంతో వారిని ఎన్నికలకు ముందు పక్కన పెట్టారు. అదేవిధంగా జగన్ హయాంలోనే ప్రతి 2 వేల ఇళ్ల పరిధిలో ఒక గ్రామ, వార్డు సచివాలయాన్ని ఏర్పాటు చేశారు. దీనిలో ప్రభుత్వంలోని మునిసిపల్ నుంచి రెవెన్యూ వరకు పోలీసు నుంచి ఇరిగేషన్ వరకు అన్ని శాఖలకు సంబంధించి సెక్రటరీలు, అడ్మిన్‌లను ఏర్పాటు చేశారు. అయితే.. వీటి వల్ల ప్రత్యేకంగా వచ్చిన లబ్ధి, ప్రజలకు అందిన ప్రత్యేక సేవలు లేవని భావిస్తున్న కూటమి ప్రభుత్వం సచివాలయాలను ఆయా ప్రభుత్వాల శాఖలకు అటాచ్ చేయనున్నారు. అదేవిధంగా కొన్నింటిని కలిపివేయనున్నారు. ఈ మేరకు తాజాగా సీఎం చంద్రబాబు నేతృత్వంలో జరిగిన రాష్ట్ర మంత్రి వర్గ సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. అదేవిధంగా వలంటీర్ వ్యవస్థకు సంబంధించి కూడా పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఎన్నికల నేపథ్యంలో వీరంతా పక్కన ఉన్న విషయం తెలిసిందే.




అయితే.. అప్పట్లో 2.3 లక్షల మంది వాలంటీర్లకు గాను.. 1.7 లక్షల మంది వైసీపీ నేతల ఒత్తిడితో తమ ఉద్యోగాలకు రాజీనామా చేశారు. మిగిలిన వారిలోనూ చాలా మంది వేరే ఉపాధి చూసుకుని వెళ్లిపోయారు. ఈ నేపథ్యంలో ప్రస్తుతం ఉన్న వలంటీర్లను ప్రభుత్వ శాఖలకు అటాచ్ చేస్తారు. వారి నైపుణ్యం.. సహా ఇతర విద్యార్హతలను బట్టి ఆయా శాఖల్లో వారికి అవకాశం కల్పిస్తారు. ఈ క్రమంలోనే ఎన్నికలకు ముందు చంద్రబాబు ఇచ్చిన హామీ మేరకు వారికి నెలకు రూ.10 వేల చొప్పున వేతనం ఇవ్వనున్నారు. అయితే.. రాజీనామా చేసిన వారిని మాత్రం తీసుకునేది లేదని మంత్రి వర్గ సమావేశంలో పలువురు మంత్రులు తేల్చి చెప్పడం గమనార్హం. ఇక, వలంటీర్ల విద్యార్హతను కూడా పెంచే ప్రతిపాదనకు మంత్రి వర్గం ఓకేచేసింది. ఈ విషయాలపై చర్చించి.. పూర్తిస్థాయిలో అధ్యయనం చేసేందుకు మంత్రి వర్గ ఉపసంఘాన్ని నియమించేందుకు కేబినెట్ ఆమోదించింది.

## కేసీఆర్ చరిత్రను చెరిపేయాలనుకోవడం భ్రమే

మొదటి పేజి తరువాయి

లెకలతోసహా వివరించిందని ఆయన ఉదహరించారు. కేసీఆర్‌పై బురద చల్లాలని ఆరోపణలు చేసినప్పటికీ సాధ్యపడలేదన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధిని తకువ చేసి చూపాలని కాంగ్రెస్ ప్రభుత్వం ఎంత ప్రయత్నించినప్పటికీ కుదరలేదన్నారు. బుధవారం రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన ఎంఎస్‌ఎంఈ పాలసీలో బీఆర్ఎస్ పాలనలో జరిగిన అభివృద్ధిని, ప్రస్తావించిన పలు అంశాలను ఆయన గుర్తుచేశారు.

గత పదేండ్లలో వృద్ధిరేటుకు సాక్ష్యాలివీ..

గత పదేండ్లలో ఎంఎస్‌ఎంఈల వృద్ధిరేటు 11 శాతం నుంచి 15 శాతం ఉందని కాంగ్రెస్ ప్రభుత్వమే ఒప్పుకున్నట్టు కేటీఆర్ తెలిపారు. 2018-2023 మధ్యలో టీఎస్-ఐపాస్ ద్వారా పెరిగిన సగటు పెట్టుబడులు 115 శాతం అవగా, జీఎస్డీపీలో ఎంఎస్‌ఎంఈల వాటా 10 శాతం వృద్ధి చెందిందని వివరించారు. దీన్నిబట్టి ఏటా ఎంఎస్‌ఎంఈల సంఖ్య 15 శాతం పెరిగిందని పేర్కొన్నారు. ఎంఎస్‌ఎంఈల కారణంగా ఉపాధి 20 శాతం పెరిగిందని, ఎస్సీ, ఎస్టీ మహిళలు 30 శాతం ఉద్యోగాలు పొందారని వివరించారు. ఇవి బీఆర్ఎస్ లెక్కలు కాదని, కాంగ్రెస్ ప్రభుత్వం చెప్పిన లెకనేనని కేటీఆర్ వెల్లడించారు. టీఎస్-ఐపాస్ వంటి ప్రగతిశీల విధానాలు, చిన్న పరిశ్రమలకు ఇచ్చిన ప్రోత్సాహకాలతోనే ప్రగతి సాధ్యమైందన్నారు. కేసీఆర్‌ను తకువ చేయాలనుకొని కురచ బుద్ధితో విమర్శలు చేసినంత మాత్రాన నిజాలు దాగవని చురకలంటించారు. సూర్యుడు తూర్పున ఉదయిస్తాడు అన్నదెంత నిజమో.. కేసీఆర్ తెలంగాణను అన్ని రంగాల్లో అభివృద్ధి చేశారన్నది కూడా అంతే నిజమన్నారు.

## తిరుమల లడ్డూ ప్రసాదంపై టీడీపీ, వైసీపీ నీచ రాజకీయాలు

మొదటి పేజి తరువాయి

పవిత్రమైన తిరుమల ఆలయంపై అలాంటి వ్యాఖ్యలు చేయడం పట్ల ఇప్పుడు నెట్టింట చర్చకు దారితీసింది. కాగా చంద్రబాబు చేసిన వ్యాఖ్యలను ఏపీ పీసీసీ చీఫ్ వైఎస్ షర్మిల ఖండించారు. దేవుడిని రాజకీయాల్లోకి లాగొద్దని ఆమె హితవు పలికారు. ఈ మేరకు తిరుమల లడ్డూపై చంద్రబాబు చేసిన వ్యాఖ్యలపై వైఎస్ షర్మిల 'ఎక్స్' (ట్విట్టర్) వేదికగా స్పందించారు. తిరుమలను అపవిత్రం చేస్తూ, హిందువుల మనోభావాలను దెబ్బతీసేలా టీడీపీ, వైసీపీలు నీచ రాజకీయాలు చేస్తున్నాయని ఆమె మండిపడ్డారు. సీఎం హోదాలో లడ్డూ ప్రసాదంలో నెయ్యికి బదులు జంతువుల నూనెలు వాడారంటూ చంద్రబాబు చేసిన వ్యాఖ్యలు తిరుమల పవిత్రత, ప్రతిష్ఠకు భంగం కలిగించేలా ఉన్నాయని షర్మిల ఆందోళన వ్యక్తం చేశారు. కోట్లాదిమంది హిందువుల ఆరాధ్య దైవం వేంకటేశ్వరుడికే మచ్చ తెచ్చేలా ఉన్నాయని తెలిపారు. చంద్రబాబు చేసిన ఆరోపణల్లో రాజకీయ కోణం లేకుంటే... భావోద్వేగం మీద రాజకీయం చేసే ఉద్దేశమే లేకుంటే.. నెయ్యికి బదులు జంతువుల నూనెలు నిజంగా వాడి ఉంటే... తక్షణమే ఉన్నత స్థాయి కమిటీ వేయాలని షర్మిల డిమాండ్ చేశారు. అలాగే సీబీఐతో విచారణ జరిపించాలని కోరారు. మహా పాపానికి.. ఘోర అపచారానికి పాల్పడిన నీచులెవరో తేల్చండని ఆమె సవాల్ విసిరారు. చంద్రబాబు తన వ్యాఖ్యలకు కట్టుబడి ఉండాలని, నిజాలు నిగ్గు తేల్చాలని షర్మిల డిమాండ్ చేశారు.

## సీఎం రేవంత్ రెడ్డి.. మూసీ నదిపై ప్రత్యేక ఫోకస్




ఆ వివరాలతో ఓ రిపోర్ట్ రెడీ చేసి ప్రభుత్వానికి ఇచ్చారు. అందువల్ల ఈ శని, ఆదివారం నాడు.. బుల్డోజర్లు బయలుదేరతాయనే ప్రచారం మొదలైంది. హైదరాబాద్‌లోని ఆసిఫ్ నగర్, సైదాబాద్, అంబర్ పేట, బహదూర్ పురా, నాంపల్లి, చార్మినార్, గోల్కొండ, హిమాయత్ నగర్‌లో ఉన్న అక్రమ నిర్మాణాలను కూల్చి వేస్తారని తెలుస్తోంది. ఇంకా రంగా రెడ్డి జిల్లాలోని రాజేంద్ర నగర్, రామంతపూర్, గండిపేట, సరూర్‌నగర్ లో కూడా నెక్ట్స్ కూల్చివేతలు ఉండబోతున్నాయని సమాచారం. మొత్తం 25 కిలోమీటర్లలో 12 వేలకు పైగా అక్రమ నిర్మాణాలు ఉన్నాయని తెలుస్తోంది. చిత్రమేంటంటే.. కొన్ని చోట్ల ఏకంగా అక్రమ కాలనీలే వెలిశాయి. ఐతే.. ఈ కాలనీల్లో ఉంటున్నవారంతే.. నిరుపేదలే. వారి ఇళ్లను కూల్చివేయడం సరైన పద్ధతి కాదు కాబట్టి.. ప్రభుత్వం ముందుగా వారికి ఇందిరమ్మ ఇళ్లలాంటివి ఇచ్చి, వారు పూర్తిగా సంతృప్తి పొందాక, అప్పుడు మాత్రమే అక్రమ కాలనీల జోలికి రావడం సరైన పద్ధతి అవుతుంది. మరి ప్రభుత్వం అలా చేస్తుందా లేదా అన్నది కొంత సస్పెన్స్ ఉంది. పేదలకు అన్యాయం చేస్తా మాత్రం.. అది ఈ ప్రభుత్వానికే నష్టం కాగలదు.

### అన్ని ఎన్నికలకూ ఒకే ఓటరు కార్డు
## ఒకే ఓటరు జాబితా

మొదటి పేజి తరువాయి

జమిలి ఎన్నికలు రెండు దశలుగా అమలవుతాయి. మొదటి దశలో లోక్‌సభ, అన్ని రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలు ఒకేసారి జరుగుతాయి. రెండవ దశలో.. అంటే సార్వత్రిక ఎన్నికలు జరిగిన 100 రోజుల్లోనే పంచాయతీ, మునిసిపల్ ఎన్నికలు జరుగుతాయి. అన్ని ఎన్నికలకూ ఒకే ఓటర్ల జాబితా ఉంటుంది.

వేటిని సవరించాలి?

లోక్‌సభ పదవీకాలాన్ని నిర్ణయించే ఆర్టికల్ 83, అసెంబ్లీల పదవీకాలాన్ని నిర్ణయించే ఆర్టికల్ 172లో.. మూడేసి సెక్షన్లను ప్రధానంగా సవరించాల్సి ఉంటుంది. ఆ తర్వాత రాష్ట్రపతి నోటిఫికేషన్ జారీ చేస్తారు. అయితే.. ఈ విషయంలో ప్రభుత్వం ఉభయసభల్లోనూ తీవ్ర ప్రతిఘటనను ఎదుర్కోవాల్సి ఉంటుంది. ఒకవేళ ఆమోదం పొందలేకపోతే జమిలి ఎన్నికల ప్రతిపాదన బుట్టదాఖలు కావడమే కాక.. ప్రభుత్వం నైతికంగా పార్లమెంట్ విశ్వాసాన్ని కోల్పోయినట్లవుతుంది. ఆమోదం పొందితే.. చాలా రాష్ట్ర అసెంబ్లీల పదవీకాలం కుదించుకుపోతుంది! కాగా.. 83, 172 అధికరణలకు చేసే రాజ్యాంగ సవరణలకు రాష్ట్ర అసెంబ్లీల ఆమోదం అవసరం లేదని కోవింద్ కమిటీ పేర్కొంది. సార్వత్రిక ఎన్నికలు నిర్వహించిన తర్వాత వంద రోజులకు స్థానిక ఎన్నికలు నిర్వహించాలన్న ప్రతిపాదనను అమలు చేయాలంటే మాత్రం.. ఆ మేరకు చేసే రాజ్యాంగ సవరణలకు సగం రాష్ట్రాలు ఆమోదం తెలపాల్సి ఉంటుందని పేర్కొంది.'

మరో ఐదు అధికరణలనూ..

రాజ్యాంగంలోని ఆర్టికల్ 324 కింద ఎన్నికల పర్యవేక్షణ, నిర్దేశకత్వం, నియంత్రణ ఎన్నికల కమిషన్ చేతుల్లోనే ఉంటుంది కనుక ఈ ఆర్టికల్‌ను కూడా జమిలి ఎన్నికల కోసం సవరించాల్సి ఉంటుంది. మునిసిపాలిటీలు, పంచాయితీలకు ఎన్నికలను ఒకేసారి ఎన్నికలు నిర్వహించేందుకు రాజ్యాంగంలోని ఆర్టికల్ 324(ఏ)ను ప్రవేశపెట్టాల్సి ఉంటుంది. అదేవిధంగా ఒకే ఓటరు జాబితాను, ఒకే ఫొటో గుర్తింపు కార్డును కేంద్ర ఎన్నికల కమిషన్ రూపొందించేందుకు ఆర్టికల్ 325ను సవరించాల్సి ఉంటుంది. నియోజక వర్గాల పునర్విభజనతో పాటు జమిలి ఎన్నికలు అనే పదాలను చేర్చేందుకు, శాసనసభల ఎన్నికలకు సంబంధించి పార్లమెంట్ అధికారాలను నిర్దేశించేందుకు ఆర్టికల్ 327ను సవరించాల్సి ఉంటుంది. కేంద్ర ఎన్నికల కమిషన్ రాష్ట్ర ఎన్నికల కమిషనర్లతో సంప్రదించి దేశవ్యాప్తంగా అన్ని ఎన్నికలకూ ఒకే ఓటరు జాబితాను రూపొందించాలంటే.. రాజ్యాంగంలోని 243కె, 243జడ్‌ఏలను కూడా సవరించాల్సి ఉంటుంది. ఈ సవరణలు (324 ఏ, 325, 243కె, 243జడ్ఏ) రాజ్యాంగంలోని షెడ్యూలు 7 కింద రాష్ట్రాల జాబితాలను ప్రభావితం చేస్తున్నందున.. 368(2) కింద వాటిని రాష్ట్ర అసెంబ్లీలు ఆమోదించాల్సి ఉంటుంది. ఇక.. లోక్‌సభ, రాష్ట్ర అసెంబ్లీల పదవీకాలం ఒకే రకంగా ఉండాలంటే ఆర్టికల్ '82ఏ'ను రాజ్యాంగంలో ప్రవేశపెట్టాల్సి ఉంటుంది. లోక్‌సభ, అసెంబ్లీల తొలి సమావేశపు రోజును నిర్ణయించేందుకు, రాష్ట్రపతి నోటిఫికేషన్ జారీ చేసేందుకు, వాటి పదవీకాలాన్ని ఒకేసారి ముగించేందుక 82వ అధికరణలో అయిదు సెక్షన్లకు సవరణలు చేయాల్సి ఉంటుంది. వీటితోపాటు.. జమ్ముకశ్మీర్ సహా శాసనసభలున్న కేంద్ర పాలిత ప్రాంతాల్లో కూడా జమిలి ఎన్నికలు నిర్వహించేందుకు కనీసం మూడు సవరణలు చేయాల్సి ఉంటుంది.

## భారత్‌లోని ధనిక, పేద రాష్ట్రాల జాబితా విడుదల.. టాప్‌లో తెలంగాణ!




ఢిల్లీ: భారత్‌లోని ధనిక, పేద రాష్ట్రాల జాబితాను బుధవారం ప్రధానమంత్రి ఆర్థిక సలహా మండలి (ఈఏసీ-పీఎం) విడుదల చేసింది. రాష్ట్రాల తలసరి ఆదాయం ప్రామాణికంగా ఈ జాబితాను రూపొందించింది.

తలసరి ఆదాయం ప్రకారం ధనిక రాష్ట్రాలు

ఈ నివేదిక ప్రకారం తలసరి ఆదాయం ఆధారంగా .. తెలంగాణ (జాతీయ సగటులో రాష్ట్ర తలసరి ఆదాయం 176.8 శాతం), ఢిల్లీ (167.5 శాతం), హర్యానా (176.8 శాతం), మహారాష్ట్ర (150.7 శాతం), ఉత్తరాఖండ్ (145.5 శాతం) భారతదేశంలోని ఐదు అత్యంత ధనిక రాష్ట్రాలు . ఇక ఆ తర్వాతి స్థానాల్లో టాప్-10లో.. పంజాబ్ (106 శాతం), గోవా (100.12 శాతం), కేరళ (100.32 శాతం), తమిళనాడు (101.4 శాతం), సిక్కిం (100.51 శాతం) ఉన్నాయి. కాగా, 2014లో ఏర్పాటైన ఇండియాలోని యంగెస్ట్ రాష్ట్రమైన తెలంగాణ ధనిక రాష్ట్రాలలో టాప్‌లో నిలవడం విశేషం. అటు ఢిల్లీ, హర్యానా కూడా నిలకడగా మంచి పనితీరు కనబరిచాయి.

తలసరి ఆదాయం ప్రకారం పేద రాష్ట్రాలు

తలసరి ఆదాయం ప్రకారం భారతదేశంలోని అత్యంత పేద రాష్ట్రాలు.. బీహార్ (జాతీయ సగటులో రాష్ట్ర తలసరి ఆదాయం 39.2 శాతం), ఉత్తరప్రదేశ్ (43.8 శాతం), మధ్యప్రదేశ్ (46.1 శాతం), రాజస్థాన్ (51.6 శాతం), ఛత్తీస్‌గఢ్ (52.3 శాతం). ఉత్తరప్రదేశ్, బీహార్ అత్యధిక జనాభా కలిగిన రాష్ట్రాలు అయిన్నప్పటికీ, జాతీయ సగటులో వరుసగా 43.8 శాతం, 39.2 శాతాలతో అత్యల్ప తలసరి ఆదాయాన్ని కలిగి ఉండడం గమనార్హం.

భారతదేశ జీడీపీలో ఈ ఐదు దక్షిణాది రాష్ట్రాలదే సింహభాగం

ఐదు దక్షిణాది రాష్ట్రాలు కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కేరళ, తమిళనాడులు మార్చి 2024 నాటికి భారతదేశ జీడీపీలో 30 శాతం వాటాను కలిగి ఉన్నాయి. ఇది 1991లో జాతీయ సగటు కంటే తక్కువ. ఇక దేశపు జీడీపీ టాప్ కంట్రిబ్యూటర్‌గా మహారాష్ట్ర కొనసాగుతోంది. అయితే, ఇటీవలి సంవత్సరాలలో ఆ రాష్ట్ర వాటా 15 శాతం నుంచి 13.3 శాతానికి క్షీణించింది.

## కబ్బాడిలో శివరాంపల్లి ఉన్నత పాఠశాల బాలురు బాలికలకు ఫస్ట్ సెకండ్ బహుమతులు సాధింపు



రాజేంద్రనగర్ **(నేటి శుభోదయ):** జోనల్ స్థాయి కబడ్డీ పోటీలో శివరాంపల్లి ఉన్నంత పాఠశాల బాలురు బాలికలకు ఫస్ట్ సెకండ్ బహుమతులు వచ్చినాయి. ఈ సందర్భంగా పాఠశాల అభివృద్ధి కమిటీ అధ్యక్షులు పడమటి శ్రీధర్ రెడ్డి మెమొంటోలని బహుకరించారు. ఈ కార్యక్రమంలోమల్లెల ప్రభాకర్ రెడ్డి అమ్మ ఆదర్శ పాఠశాల అధ్యక్షురాలు సునీత రెడ్డి పాఠశాల ప్రధానోపాధ్యాయులు కిషన్ నాయక్ పాఠశాల పి ఈ డి లు గంగానాయక్ జ్యోతి మరియు సుదర్శన్ నరసింహ చారి జనార్ధన్ చారి వెంకటయ్య తదితర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## సుదర్శన యాగానికి పోటెత్తిన భక్తులు





విశాఖపట్నం జిల్లా **(నేటి శుభోదయ):** విశాఖపట్నం టౌన్ ఆరిలోవ ఎర్ని దుర్గమాంబ ఆలయ ప్రాంగణంలో నిర్వహిస్తున్న చండీ సహిత సుదర్శన యాగానికి భక్తులు పోటెత్తారు అమ్మవారికి ప్రత్యేక



పూజలతో పాటు భక్తుల సహస్రాలతో సామూహిక రుద్రాభి షేకాలు నిర్వహించారు. బాలభాను అర్చక మరియు పురోహిత సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న యాగంలో రెండో రోజు వల్లి దేవ సేన సమేత సుబ్రమణ్య స్వామి కళ్యాణం అత్యంత వైభవంగా నిర్వహించారు వేద పండితులు అమ్మవారిని పరమేశ్వరున్ని స్తుతిస్తూ సాగిన ఈ యాగంలో పలువురు ప్రముఖులు పాల్గొన్నారు. టిడిపి నాయకులు ఒమ్మి సన్యాసిరావు యాగంలో పాల్గొన్నారు ఈ సందర్భంగా వేద పండితులు ఆయనకు వేద ఆశీర్వచనం అందజేశారు.

## టిఆర్ఎస్ పార్టీ స్థానిక సంస్థల ఎన్నికల అవగాహన కార్యక్రమం. చిన్నగండు రాజేందర్.

శంషాబాద్ **(నేటి శుభోదయ):** శంషాబాద్ మండల బిఆర్ఎస్ పార్టీ కుటుంబ సభ్యులకు, పార్టీ సందేశం ఏమనగా, స్థానిక సంస్థల ఎన్నికల అవగాహన కార్యక్రమంలో భాగంగా మీ గ్రామాల్లోని మీ వార్డులలో ఉన్నటువంటి ఓటర్లు ఒక వార్డులో కుటుంబ సభ్యులు ఒకే వార్డులో ఉండే విధంగా ఒకవేళ లేనిచో సరిదిద్దుకునే వీలు, వెసులుబాటు ఎంపీడీవో అధికారి మనకు కల్పించడం జరిగిందని టీఆర్ఎస్ సీనియర్ నాయకులు శంషాబాద్ మండల ప్రధాన కార్యదర్శి మంచర్ల మోహన్ రావు అన్నారు. అదే విధంగా మీకు ఎవరికైతే రెండు చోట్ల ఓట్లు ఉన్నాయో వాళ్లు ఒకటే చోట మీకు ఇష్టం వచ్చిన చోట ఉంచుటకు వీళ్ళు కల్పిస్తూ ఎన్నికల అధికారి ఈరోజు ఎంపీడీవో కార్యాలయంలో సమావేశం నిర్వహించడం జరిగిందని తెలిపారు , కావున మీ మీ గ్రామాల్లోని బిఆర్ఎస్ పార్టీ కుటుంబ సభ్యులందరూ గడపగడపకు, ఇంటి ఇంటికి వెళ్లి మీ గ్రామాల్లోని ఓటర్లను సంఘటితపరిచి అవగాహన కల్పించి పైన పేర్కొన్న విధంగా సహాయం చేయాలి చివరి తేదీ సెప్టెంబర్ 21 అని కోరుతూ మీ మంచర్ల మోహన్ రావు (మండల పార్టీ ప్రధాన కార్యదర్శి)

## ఏ.పి సాండ్ మేనేజ్మెంట్ సిస్టం పోర్టల్ ద్వారా ఇసుక సరఫరా

### పోర్టల్ ను ప్రారంభించిన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు



విశాఖపట్నం జిల్లా **(నేటి శుభోదయ):** అనకాపల్లి జిల్లా రాష్ట్ర ప్రజలు ఉచితంగా ఇసుకను బుక్ చేసుకోవడంతో పాటు ఇసుక సరఫరా కోసం రాష్ట్ర ప్రభుత్వం ఏ.పి శాండ్ మేనేజ్మెంట్ సిస్టం పోర్టల్ ను ఏర్పాటు చేయడం జరిగిందని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. ఈ సందర్భంగా గురువారం సాయంత్రం ఏ.పి సాండ్ మేనేజ్మెంట్ సిస్టం పోర్టల్ ను ముఖ్యమంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆన్లైన్ లేదా గ్రామ వార్డ్ సచివాలయంలో ఇసుకను ఉదయం 10.30 నుంచి 5-00 గంటల వరకు బుకింగ్ ఆర్డర్ తీసుకోవాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి విజయవాడ నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లతో సమావేశం నిర్వహించారు. ముఖ్యమంత్రి వర్చువల్ కాన్ఫరెన్స్ లో అనకాపల్లి జిల్లా నుంచి జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్ , జాయింట్ కలెక్టర్ ఎం జాహ్నవి, మైన్స్ అండ్ జియాలజీ శాఖ ,జిల్లా పంచాయతీ అధికారి, డిస్టిక్ శాండ్ కమిటీ మెంబర్లు తో పాటు ఇతర జిల్లా అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లాలో ఇసుక వినియోగదారులకు సూచనలు మరియు ఇసుక రవాణా వాహనదారులకు సూచనలకు సంబంధించిన గోడ పత్రికను (పోస్టర్స్)జిల్లా కలెక్టర్ ఆవిష్కరించారు.

## ప్రజా భవన్ ముట్టడి కోసం ముందస్తు అరెస్ట్



శంషాబాద్ **(నేటి శుభోదయ):** చలో ప్రజాభవన్ అంటూ ఆందోళన చేయనున్న రుణమాఫీ కానీ రైతుల వ్యవహారంతో శంషాబాద్ బిఆర్ఎస్ నాయకులను స్థానిక పోలీసుల ముందస్తు అరెస్టులు చేస్తున్నారు. ఇందులో భాగంగా గురువారం స్థానిక మల్కారం పిఎసిఎస్ చైర్మన్ బుర్కుంట సతీష్ ను ఆయన స్వగృహం నందు పోలీసులు అదుపులోకి తీసుకొని ముందస్తుగా చర్యగా అరెస్టు చేస్తున్నమన్నారు. రైతులు అందరూ ఏకమై గ్రామాలు మండలాలు జిల్లాల వారీగా చలో ప్రజా భవన్ ఆందోళనలో పాల్గొని రుణమాఫీ అయ్యేవరకు పోరాటం చేద్దామంటున్న రైతన్నల అంశంతో పోలీసులు ముందస్తు చర్యలు చేపడుతున్నారు. ఈనెల 20న క్యాబినెట్ సమావేశం ఉన్నందున ప్రజాభవన్ ముట్టడి చేస్తే క్యాబినెట్లో వాళ్ల సమస్యకు పరిష్కారం దొరుకుతుంది ఉన్న రైతులు. రైతులకు వెంటనే రుణమాఫీ చేసే విధంగా ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీ నిర్ణయించిందని తెలిపారు.

# విశాఖ నగరంలో అన్నా క్యాంటీన్లు ప్రారంభం

### జీవీఎంసీ కమిషనర్ డాక్టర్ పి.సంపత్ కుమార్

విశాఖపట్నం జిల్లా **(నేటి శుభోదయ):** ఆంధ్ర రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పేదల ఆకలి తీర్చే 25 అన్న క్యాంటీన్లను విశాఖ నగరంలో ప్రారంభించబడుతున్నాయని జీవీఎంసీ కమిషనర్ డాక్టర్ పి. సంపత్ కుమార్ పేర్కొన్నారు. గురువారం జీవీఎంసీ 3వ జోన్ పరిధిలో ఎంవిపి రైతు బజార్ సమీపంలో గల అన్న క్యాంటీన్ ను, విశాఖపట్నం పార్లమెంట్ సభ్యులు ఎం.శ్రీ భరత్ ,విశాఖ తూర్పు నియోజకవర్గం శాసనసభ్యులు వెలగపూడి రామకృష్ణ బాబు, విశాఖ జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ తో కలిసి ప్రారంభోత్సవం చేసి స్వయంగా అందరూ కలిసి పేద ప్రజలకు ఆహారాన్ని వడ్డించి అందించడం జరిగినదని కమిషనర్ తెలిపారు. ఈ సందర్భంగా జీవీఎంసీ కమిషనర్ మాట్లాడుతూ జీవీఎంసీ అన్ని జోన్ల పరిధిలో ఎంతోమంది పేదలకు 5 రూపాయలకే ఆకలి తీర్చే 25 అన్న





క్యాంటీన్ లను సిద్ధం చేయడం జరిగిందని, రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దృఢ సంకల్పంతో పేదవాడికి 5 రూపాయలకే అన్నం పెట్టాలనే ఉద్దేశంతో అన్నా క్యాంటీన్లు ప్రారంభించారని తెలిపారు. విశాఖ నగరంలో వాస్తవానికి ఆగస్టు 15వ తేదీన ప్రారంభంచవలసిన అన్న క్యాంటీన్ లను ఎమ్మెల్సీ ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలులోనికి రావడం వలన, అలాగే విజయవాడ వరదల కారణంగా వాయిదా పడ్డాయని తెలిపారు. జీవీఎంసీ పరిధిలో మొత్తంగా 25 అన్న క్యాంటీన్లను ప్రారంభానికి సిద్ధం చేయడమైనదని, అందులో గురువారం 17 అన్న క్యాంటీన్లను అన్ని జోన్ల పరిధిలో ప్రజా ప్రతినిధుల తో ప్రారంభించబడ్డాయని, మిగిలినవి శుక్ర, శని వారాలలో ప్రారంభించబడతాయని కమిషనర్ తెలిపారు. ఈ అన్నా క్యాంటీన్లలో పేదల కొరకు ఉదయం 7.30 నుండి 10.00 గంటల వరకు అల్పాహారంగా మూడు ఇడ్లీ ,చట్నీ ,సాంబారు వారంలో మూడు రోజులు పూరి లేదా పొంగలి, కూర్మా ఇస్తారని, మధ్యాహ్నం భోజనం 12.00 నుండి 3.00 గంటల వరకు, రాత్రి 7.30 నుండి 9.00 గంటల వరకు రాత్రి భోజనం లో అన్నం, కూర, పప్పు, సాంబారు, పెరుగు ,పచ్చడి, ఉంటుందని వారంలో ఒకరోజు స్పెషల్ రైస్ కూడా ఉంటుందని , ఆదివారం రోజున అన్న క్యాంటీన్లకు సెలవు ఉంటుందని కమిషనర్ తెలిపారు. నగరం లో గల పేద ప్రజలు ఈ అన్న క్యాంటీన్లలో ఐదు రూపాయలకే ఉదయం అల్పాహారం , మధ్యాహ్నం ,రాత్రి భోజనం చేయవచ్చునని ,ఈ అవకాశాన్ని పేద ప్రజలు వినియోగించుకోవాలని కమిషనర్ విజ్ఞప్తి చేశారు. విశాఖ నగరంలో ఇండస్ట్రియల్ స్టేట్ లో గల అక్షయపాత్ర ఫౌండేషన్ నిర్వాహకులు అన్న క్యాంటీన్లకు సరఫరా చేసే ఆహార వంటసాల నిర్వహణను స్వయంగా పరిశీలించడం జరిగిందని కమిషనర్ తెలిపారు. వంటశాలలో ఆహారం వేడిగా ఉండేందుకు హాట్ ప్యాక్ లను ,సరఫరా చేసే ప్లేట్లను, శుచి శుభ్రతను ఎలా నిర్వహిస్తున్నారో అక్షయపాత్ర ఫౌండేషన్ స్వామీజీ తనకు వివరించారని కమిషనర్ తెలిపారు. పేద ప్రజలకు పెట్టే ఆహారంలో శుచి ,శుభ్రతతో కూడిన వేడి ఆహారాన్ని అందించాలని ఎటువంటి ఇబ్బందులు, లోపాలు లేకుండా నిత్యం నిర్ణీత సమయాలలో అన్న కాంటీన్లకు ఆహారం సరఫరా చేసేలా జాగ్రత్తలు చేపట్టాలని వారికి ఆదేశించడమైనదని కమిషనర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ శాసనమండలి సభ్యులు ,బిజెపి నాయకులు పి.వి.ఎన్ .మాధవ్, టిడిపి నాయకులు పట్టాభిరామ్, జోనల్ కమిషనర్-3 శివప్రసాద్, పర్యవేక్షక ఇంజనీర్ పి వి విసత్యనారాయణ రాజు తదితరులు పాల్గొన్నారు.

# అన్నార్తుల ఆకలి తీర్చడమే చంద్రన్న ధ్యేయం

### పేదలకు కడుపునిండా భోజనం పెట్టే ఈ గొప్ప కార్యక్రమాన్ని ప్రారంభించడం ఆనందదాయకం

### భీమిలి శాసనసభ్యులు గంటా శ్రీనివాస్.

### మధురవాడ మారికవలస కూడలలో అన్నా క్యాంటీన్ ప్రారంభం.



విశాఖపట్నం జిల్లా**(నేటి శుభోదయ):** మధురవాడ అన్నార్తుల ఆకలి తీర్చడమే ముఖ్యమంత్రి చంద్రన్న ధ్యేయంగా అన్నా క్యాంటీన్లను ఏర్పాటు చేసారని, కూటమి ప్రభుత్వం పేదల ప్రభుత్వం అని మాజీ మంత్రి భీమిలి నియోజకవర్గం శాసనసభ్యులు గంటా శ్రీనివాసరావు అన్నారు. జీవీఎంసీ జోన్-2 పరిధి 5వ వార్డులో మారికవలస కూడలిలో అన్నా క్యాంటీన్ ను స్థానిక కార్పొరేటర్ మొల్లి హేమలత తో....సంయుక్తంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా గంటా శ్రీనివాస్ మాట్లాడుతూ పేదలకు కడుపునిండా భోజనం పెట్టే ఈ గొప్ప కార్యక్రమాన్ని ప్రారంభించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు.



సీఎం చంద్రబాబు నాయుడు మానసపుత్రిక అన్నా క్యాంటిన్ కార్యక్రమం అని, ప్రజలు కూడా ఈకార్యక్రమానికి సహకరించాలని కోరారు. సేవాభావంతో ముందుకు వచ్చి అన్న క్యాంటీన్లకు విరాళాలు ఇచ్చి.. పేదల కడుపు నింపడంలో మీ వంతు పాత్ర పోషించాలని గంటా పిలుపునిచ్చారు. నాడు స్వాతంత్ర్య ఉద్యమ సమయంలో డొక్కా సీతమ్మ గోదావరి దాటి వచ్చిన ప్రతీ ఒక్కరికీ కడుపునండా అన్నం పెట్టేవారని ఏ సౌకర్యాలు లేని సమయంలోనే పేదల కడుపు నింపిన గొప్ప మహోన్నత వ్యక్తిత్వం కలిగిన గొప్ప మానవతావాధి డొక్కా సీతమ్మ అని కొనియాడారు. అటు తరువాత 1983లో అధికారంలోకి వచ్చిన తరువాత దివంగత మహానేత ఎన్టీఆర్ తిరుపతిలో అన్నదాన ట్రస్టు ప్రారంభించారని చెప్పారు. ప్రతిరోజు వేలాది మంది భక్తులు వచ్చి తన ఆకలి తీర్చుకునే వారని చెప్పారు. ఈ ట్రస్టుకు దాతల నుంచి రూ.1000 కోట్లు ఆదాయం వచ్చిందని దానిని బ్యాంకుల్లో వడ్డీతోనే నిత్యాన్నదాన కార్యక్రమాలు కొనసాగించారన్నారు. వారి స్ఫూర్తితో చంద్రబాబునాయుడు 2014 నుంచి 2019 మధ్య రాష్ట్ర వ్యాప్తంగా 200కు పైగా అన్న క్యాంటీన్లను ప్రభుత్వం ఏర్పాటు చేసిందని చెప్పారు. పేదవాడి కడుపునిం పేందుకు భవనాలు నిర్మించి పరిశుభ్రమైన వాతావరణంలో, నాణ్యమైన భోజనాన్ని రూ.5కే అందించామని చెప్పారు.కార్యక్రమంలో భీమిలి నియోజకవర్గ జనసేన టిడిపి ఇన్చార్జిలు కోరాడ రాజబాబు, సందీప్ పంచకర్ల, స్థానిక టిడిపి నాయకులు మొల్లి లక్ష్మణరావు, వాండ్రాశి అప్పలరాజు,బోయ శ్రీను, రమాదేవి,నాగోతి వెంకట సత్యనారాయణ (జపాన్), జనసేన అధ్యక్షులుదేవర శివ,పొట్టి ప్రసాద్,గల రవి, కొండపు రాజు, ఇయ్యపు నాయుడు,ఈగల అప్పలనాయుడు, ఆనందరావు, కామరాజు, ముచి రామనాయుడు, బొడ్డేపల్లి రంగా,చక్రి, ఎం. నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## దక్షిణ నియోజకవర్గం లో అన్న క్యాంటీన్ లు ప్రారంభించిన స్థానిక ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్

- కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎంపీ శ్రీ భరత్,టీడీపీ ఇన్చార్జి సుధాకర్, బిజెపి నేతలు
- కేజీహెచ్, టర్నల్ చౌల్ట్రి, ఫ్రూట్ మార్కెట్ ప్రాంతాల్లో ప్రారంభం
- పండుగ వాతావరణంలా కార్యక్రమంలో పాల్గొన్న కూటమి శ్రేణులు



విశాఖపట్నం జిల్లా **(నేటి శుభోదయ):** దక్షిణ నియోజకవర్గంలో కేజీహెచ్, టర్నల్ చౌల్ట్రి, ఫ్రూట్ మార్కెట్ ప్రాంతాల్లో అన్న క్యాంటీన్ లను విశాఖ ఎంపీ శ్రీ భరత్,స్థానిక ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్, టీడీపీ సౌత్ ఇన్చార్జి సుధాకర్ అన్న క్యాంటీన్ లను ప్రారం భించారు ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ కూటమి నేతలతో కలసి పలువురికి స్వయంగా వడ్డించారు. ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ మాట్లాడుతూ పేదలకు రుచికర మైన నాణ్యమైన ఆహారం 5 రూపాయలకు అందించిన గొప్ప విషయమని అన్నారు పేదలకు అవసరమైన ప్రదేశాలలో ఏర్పాటు చేశామని తెలిపారు. కూటమి ప్రభుత్వం



అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రతి హామీ నెరవేర్చడం జరిగిందనన్నారు కార్యక్రమంలో కార్పొరేటర్లు,మాజీ కార్పొరేటర్లు, కూటమి శ్రేణులు,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఆర్థిక సాయం అందించేందుకు కృషి: ఎమ్మెల్యే



విశాఖపట్నం జిల్లా **(నేటి శుభోదయ):** ఇటీవల దేవరాపల్లి మండలం ములకలాపల్లి గ్రామానికి చెందిన వడగళ్ల యశ్వంత్ 12 సంవత్సరాలు వయసుగల అబ్బాయి విద్యుత్ షాక్ గురై మృతి చెందిన విషయం తెలిసిందే మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణ గురువారం యశ్వంత్ కుటుంబాన్ని పరామర్శించారు.స్థానిక నాయకులతో కలిసి ఎమ్మెల్యే ములకలాపల్లి గ్రామానికి చేరుకొని యశ్వంత్ కుటుంబానికి ఆర్థిక సహాయం అందేలా కృషి చేస్తానని భరోసా కల్పించారు.

## అన్యమత ప్రచారం చేస్తున్న వారిని

### అడ్డుకున్న విశ్వహిందూ పరిషత్ నాయకులు



విశాఖపట్నం జిల్లా **(నేటి శుభోదయ):** యలమంచిలిపట్నం లోని అన్యమత ప్రచారం నిర్వహించడంపై యలమంచిలి పోలీసులు అర్ధరాత్రి ఫిర్యాదు చేశారు. వివరాల ప్రకారం ఈ నెల 18వ తేదీ సాయంత్రం 4-30 నుండి 5 గంటల మధ్య యలమంచిలి పాత వీధిలో గాజువాక కి చెందిన కొంతమంది బలవంతపు మత మార్పులకు ప్రోత్సహిస్తూ హిందూ దేవుళ్ళను దూషించుచూ ప్రోత్సహిస్తున్నారని అన్నారు. హిందువుల ఇళ్ళకు వెళ్లి పాంప్లెట్లు పంచుతూ బలవంతపు మత మార్పిడి చేస్తున్నారని తెలిపారు. ప్రచారం చేస్తూ పట్టు పట్టడంతో వాళ్లని యలమంచిలి టౌన్ పోలీస్ స్టేషన్ కి అప్పగించడం జరిగిందని, ప్రచారం చేస్తూ హిందువుల మనో భావాలను దెబ్బతీసే విధంగా ప్రవర్తిస్తున్నారని విశ్వహిందూ పరిషత్ నాయకులు, కార్యకర్తలు అన్నారు. వారిపై చట్ట రిచ్ఛ కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

## మున్సిపల్ కార్పొరేషన్ ఏడో వార్డులో సీసీ రోడ్డు పనులు ప్రారంభం



గండిపేట ప్రతినిధి(నీటి శుభోదయ) బండ్ల గూడ జాగిర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 7 వ డివిజన్ నరసా రెడ్డి కాలనీ, రాధా నగర్, ఫేస్ 2 లో 30 లక్షల నిధులతో సీసీ రోడ్డు పనులను సకాలంలో ప్రారంభించిన స్థానిక కార్పొరేటర్ పద్మావతి పాపయ్య యాదవ్. ఈసందర్భంగా వాటి నిర్మాణం పనులను పర్యవేక్షించడం జరిగింది. ఈ సందర్భంగా కార్పొరేటర్ పద్మావతి పాప యాదవ్ మాట్లాడుతూ.... బండ్లగూడ జాగిర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో 30 లక్షల రూపాయలతో ఏడూ డివిజన్లో కొనసాగుతున్న సిసి రోడ్డు పనులను త్వరగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ఆమె అన్నారు. ప్రధానంగా సిసి రోడ్డు నిర్మాణం పనుల్లో ఎలాంటి నాణ్యత లోపాలు తలెత్తకుండా నాణ్యతతో నిర్మించినప్పుడే పదికాలాల పాటు అవి ప్రజలకు ప్రయోజకరంగా ఉంటాయని ఆమె అన్నారు. సిసి రోడ్ నిర్మాణం పనులను ఎప్పటికప్పుడు సంబంధిత అధికారులు పర్యవేక్షణలో జరగాలని అలాగే ప్రజాధనంతో చేపడుతున్న సిసి రోడ్లు నాన్నతో ప్రమాణాలతో నిర్మించాలని ఆమె డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏడో డివిజన్ ప్రజలు పార్టీ నేతలు పాల్గొన్నారు.



## బండ్లగూడ జాగిర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో స్వచ్ఛతా హి సేవ 2024



గండిపేట ప్రతినిది**(నేటి శుభోదయ):** బండ్లగూడ జాగిర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో కమిషనర్ బీచ్ శరత్ చంద్ర ఆధ్వర్యంలో స్వచ్ఛతా హి సేవ 2024 కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా ఈరోజు ఉదయం దర్గా, హిమాయత్ సాగర్, యందు ప్రజలకు చెత్తను వేరు చేయుటపై ( తడి,పొడి, హానికర ) అవగాహన కల్పించిన కమీషనర్ . శరత్ చంద్ర అనంతరం హైదర్షకోటలోని ప్రభుత్వ పాఠశాల యందు విద్యార్థిని విద్యార్థులకు కూడా చెత్త సేకరణపై అవగాహన కల్పించి అనంతరం విద్యార్థిని విద్యార్థులచే స్వచ్ఛతా ప్రతిజ్ఞ చేయించి, మొక్కలు( వన మహోత్సవం )నాటించారు. ఖాళీమందిర్ దగ్గర గల పబ్లిక్ టాయిలెట్ ను సందర్శించి టాయిలెట్స్ బయట మరియు లోపల సిబ్బందితో క్లీన్ చేయించారు.ఇట్టి కార్యక్రమంలో శానిటరీ ఇన్స్పెక్టర్ నరేష్, పాఠశాల హెడ్మాస్టర్,టీచర్లు, బిల్ కలెక్టర్ నరేందర్ రెడ్డి, శానిటరీ జవాన్లు మల్లేష్, వెంకటేష్, కృష్ణ, నరేందర్ పాల్గొన్నారు..

## విశాఖపట్నం రేంజ్ అక్రమ గంజాయి సాగు మరియు వ్యాపారాన్ని నిర్మూలించడంలో గణనీయమైన విజయాన్ని సాధించింది.

విశాఖపట్నం జిల్లా**(నేటి శుభోదయ):** భారీ పురోగతిలో, విశాఖపట్నం పరిధిలోని పోలీసులు గంజాయి అక్రమ సాగు మరియు వ్యాపారాన్ని ఎదుర్కోవడంలో గణనీయమైన పురోగతిని సాధించారు, పంట మరియు విధ్వంసం యొక్క గుర్తింపు, పంపిణీ మరియు రవాణా నెట్‌వర్క్‌కు అంతరాయం, నిందితులు మరియు పెడ్లర్ల నెట్‌వర్క్‌ను విచ్ఛిన్నం చేయడం వంటి బహుముఖ వ్యూహాన్ని ఉపయోగించారు. వినియోగదారు విద్య. ఈ సమగ్ర విధానం గత మూడేళ్లలో అద్భుతమైన ఫలితాలను ఇచ్చింది.

**ముఖ్య విజయాలు:**

1,378 కేసులు నమోదు చేయబడ్డాయి, ఫలితంగా 2,08,475 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. మరియు అక్రమ వ్యాపారంలో పాల్గొన్న 3890 మంది వ్యక్తులను అరెస్టు చేశారు. అల్లూరి సీతారామరాజు జిల్లాలో గత మూడు సీజన్లలో 10,000 ఎకరాల గంజాయి పంటలు ధ్వంసమయ్యాయి. చట్టబద్ధమైన వ్యవసాయ పద్ధతులను ప్రోత్సహించడం ద్వారా 9,000 ఎకరాలు విస్తీర్ణంలో ఉన్న ప్రత్యామ్నాయ పంటల పంపిణీ ద్వారా 8,585 మంది రైతులు ప్రయోజనం పొందారు. 650 అవగాహన ప్రచారాలు నిర్వహించబడ్డాయి, 3కి చేరుకుంది

## యువత చెడు అలవాట్లకు ప్రభావితం కాకుండా ఉండాలి ఎస్ఐ కె సావిత్రి



విశాఖపట్నం జిల్లా **(నేటి శుభోదయ):** యలమంచిలి డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకులం, కొక్కిరాపల్లిలో విద్యార్థులకు ప్రేరణా కార్యక్రమం నిర్వహించడం జరిగిందని అన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా యలమంచిలి టౌన్ ఎస్ ఐ కె సావిత్రి చేయడం జరిగిందని తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ఐ కె సావిత్రి మాట్లాడుతూ ప్రస్తుత రోజులలో యువతలో వచ్చిన మార్పులు, అమ్మాయిలపై జరుగుతున్న ఘోరాలు, వాటిని ఎలా ఎదురోవాలి అనే ఆశాలపై అవగాహన కల్పించడం జరిగిందని అన్నారు. యువత ఆన్లైన్ మోసాలు, నుండి ఎలా బయట పడాలి? చెడు అలవాట్లకు ప్రభావితం కాకుండా మంచి మార్గంలో నడవాలని సూచించడం జరిగిందని తెలిపారు. అమ్మాయిలపై అఘాయిత్యాలు జరిగినట్లు పోలీసుల దృష్టికి వచ్చినట్లయితే పాక్యచట్టం ద్వారా శిక్ష పడుతుందని అన్నారు. గురుకుల పాఠశాల నుండి 5 మంది విద్యార్థినులు 49వ రాష్ట్ర యోగాసన క్రీడా ఛాంపియన్‌షిప్ -2024 వారి నిర్వహించిన యోగాని పోటీలో పాల్గొనడం జరిగిందని అన్నారు. రాష్ట్ర స్థాయిలో పాఠశాలకి 3వ స్థానం లభించిందని కళాశాల ప్రిన్సిపాల్ మాణిక్యం తెలిపారు. పాల్గొన్న 15 మంది విద్యార్థినులంగా ముగ్గురు జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారని అన్నారు. ఈ సందర్భంగా యోగా శిక్షణ ఇచ్చిన ఆర్ట్ ఆఫ్ లివింగ్ యోగ గురువు ఎం. రాముని, ప్రిన్సిపాల్ సత్కరించడం జరిగిందని తెలిపారు. అదేవిధంగా యోగాలో నిరంతర సాధన చేయిస్తున్న కళాశాల పిడి, ఆర్ ఇటి రమాదేవి, విజయ కుమారిని అభినందించడం జరిగిందని అన్నారు.

## అక్రమంగా నరికిన చెట్లు అడ్డుకున్న పంచాయతీ సిబ్బంది



విశాఖపట్నం జిల్లా**(నేటి శుభోదయ):** పాయకరావుపేట మండలం పంచాయతీ కార్యదర్శి అయిన సి హెచ్ రవి కుమార్ వర్మ, సీతారామ రాజు అను వారు పాయకరావు పేట పోలీస్ స్టేషన్ కు వచ్చి గెద్దమూరి నానాజీ మరియు మరికొందరు వ్యక్తులు పాయకరావుపేట పంచాయతీ కి చెందిన లింగాలతోట కాలనీ 5వ లైన్ రోడ్డు ప్రక్కన గల నెరెడు చెట్టును అక్రమంగా నరికివేసినట్లు తెలిసుకుని అతను తన సిబ్బందిని అక్కడికి పంపించి చెట్టు దుంగలను తీసుకెళ్లకుండా అడ్డుకొనగా, గెడ్డమురి నానాజీ మరియు మరికొందరు వ్యక్తులు తన సిబ్బంది మీద నానా దూర్భాషలు అడి బలవంతంగా %ూూ 39 ఖ+% 8068 నంబర్ గల ట్రాక్టర్‌పై నెరెడు చెట్టు దుంగలను ఎక్కించి తీసుకుని వెళ్లిపోయినట్లు,. భూమిలో నేరేడు చెట్టును అక్రమంగా నరికివేయడం, నెరెడు దుంగలను తీసుకుని వెళ్ళిపోవడం, వాల్టా చట్టం ప్రకారం నేరమని, ఫిర్యాదు చేసినందున కేసు నమోదు చేసి శ్రీ సిఐ వారు దర్యాప్తు చేయుచున్నారు.


## దసరా సెలవులు ప్రకటించిన రాష్ట్ర ప్రభుత్వం




విశాఖపట్నం జిల్లా (నేటి శుభోదయ): అక్టోబర్ 2 నుంచి 14 వరకు పాఠశాలలకు సెలవులు ప్రకటిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. 15న తిరిగి స్కూళ్లు ప్రారంభం.

## ఎన్డీఏ శాసనసభా పక్ష సమావేశం

ఎమ్మెల్యేలకు దిశానిర్దేశం చేసిన సీఎం చంద్రబాబు.



విశాఖపట్నం జిల్లా **(నేటి శుభోదయ):** ఇసుక సహా ఎలాంటి అక్రమాల జోలికి వెళ్లొద్దని సున్నితంగా హెచ్చరించిన సీఎం చంద్రబాబు.100 రోజుల పాలనపై ఈ నెల 20వ తేదీ నుంచి ఆరు రోజుల పాటు ప్రజల్లో పర్యటించాలని ఎమ్మెల్యేలకు సీఎం సూచన. మహిళలకు ఉచిత గ్యాస్ సిలిండర్లను దీపావళి నుంచి ఇస్తామని శాసనసభా పక్ష భేటీలో క్లారిటీ ఇచ్చిన సీఎం చంద్రబాబు.

## రేపు వైసీపీకి జగ్గయ్యపేట మాజీ ఎమ్మెల్యే ఉదయభాను రాజీనామా..



విశాఖపట్నం జిల్లా (నేటి శుభోదయ): ఆంధ్ర ప్రదేశ్ : ఈనెల 22న జనసేనలో చేరనున్న మాజీ ఎమ్మెల్యే.. రేపు కార్యకర్తలతో సమావేశం

## ఆత్మీయ సన్మానం...




పెద్దపల్లి ప్రతినిధి,**(నేటి శుభోదయ):** తెలంగాణ రాష్ట్ర పీసీసీ ప్రెసిడెంట్ గా ఎన్నికైన మహేష్ కుమార్ గౌడ్ కు రామగుండం ఎమ్మెల్యే శ్రీ రాజ్ ఠాకూర్ మక్కాన్ సింగ్ గారి ఆత్మీయ సన్మానం....

### హైదరాబాద్ రవీంద్రభారతిలో ఘనంగా వేడుకలు...

రామగుండం: తెలంగాణ రాష్ట్ర పీసీసీ ప్రెసిడెంట్ గా ఇటీవల ఎన్నికైన మహేష్ కుమార్ గౌడ్ ను పెద్దపల్లి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రామగుండం శాసనసభ్యులు శ్రీ రాజ్ ఠాకూర్ మక్కాన్ సింగ్ ఆత్మీయంగా సన్మానించారు.. .ఈ మేరకు హైదరాబాద్ లోని రవీంద్ర భారతిలో జరిగిన వివిధ కులాల ఆత్మీయ అభినందన సభలో ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ మక్కాన్ సింగ్ పాల్గొని మహేష్ కుమార్ గౌడ్ కు పుష్పగుచ్చం అందించి, శాలువాతో సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీలో ఎంతో కీలకమైన పదవిని వరించిన మహేష్ కుమార్ గౌడ్ పార్టీ బలోపేతం తో పాటు ప్రజా శ్రేయస్సు కోసం పాటుపడే వ్యక్తి అని పేర్కొన్నారు. అన్ని వర్గాలతో... అందరితో ఆత్మీయంగా కలిసి ఉండే మహేష్ కుమార్ గౌడ్ కు పీసీసీ పగ్గాలు అందించిన సీఎం రేవంత్ రెడ్డి గారికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు. అదేవిధంగా రాష్ట్రం లోని ప్రజలు ఆశించిన విధంగా సీఎం రేవంత్ రెడ్డి రాష్ట్రంలో ప్రజా పాలన కొనసాగిస్తున్నారన్నారు. ఈ క్రమంలో పదేళ్ల గడీల పాలన నుంచి స్వచ్ఛమైన కాంగ్రెస్ పార్టీ చేతికి ప్రజలు పరిపాలన వ్యవస్థ ను అవకాశాన్ని ఇచ్చారన్నారు. ఇదే క్రమంలో ప్రజలు ఆశించిన మేరకు రాష్ట్రాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసేందుకు సీఎం రేవంత్ రెడ్డి టీం కృషి చేస్తుందన్నారు. రాష్ట్రంలో పార్టీని ప్రజా ప్రతినిధులను, నాయకులను, కార్యకర్తలను సమన్వయ పరచడంలో మహేష్ కుమార్ గౌడ్ అనుభవమున్న వ్యక్తి అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు హన్మంతరావు తోపాటు మంత్రులు సీతక్క, పొన్నం ప్రభాకర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.


## అక్టోబరు 3 నుంచి ఇంద్రకీలాద్రిపై దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు



విశాఖపట్నం జిల్లా **(నేటి శుభోదయ):** విజయవాడ: సామాన్య భక్తులకు అమ్మవారి దర్శనం కల్పించడంతో పాటు ఎలాంటి లోటుపాట్లకు తావు లేకుండా సమన్వయంతో దసరా శరన్నవరాత్రి ఉత్సవాలను విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ జి.సృజన అధికారులను ఆదేశించారు. ఇంద్ర కీలాద్రి పై అక్టోబరు 3 నుంచి 12 వరకు నిర్వహించనున్న దసరా ఉత్సవాల ఏర్పాట్లపై కలెక్టర్, సీపీ రాజశేఖర్‌బాబు, ఎమ్మెల్యే సుజనాచౌదరి సంబంధిత శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. మూలా నక్షత్రం రోజు అమ్మవారికి రాష్ట్ర ప్రభుత్వం తరుపున ముఖ్యమంత్రి చంద్రబాబు పట్టు వస్త్రాలు సమర్పించనున్నారని, అందుకు తగిన విధంగా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ తెలిపారు. ఉత్సవాల్లో భాగంగా వివిధ అలంకారాల్లో అమ్మవారు భక్తులకు దర్శనమివ్వనున్నారు.

అక్టోబర్ 3 - బాలా త్రిపురసుందరిదేవి,అక్టోబరు 4 - గాయత్రీ దేవి,అక్టోబరు 5 - అన్నపూర్ణ దేవి,అక్టోబరు 6 - లలిత త్రిపుర సుందరి దేవి,అక్టోబరు 7 - మహాచండీ దేవి,అక్టోబరు 8 - శ్రీమహాలక్ష్మి దేవి,అక్టోబరు 9 - సరస్వతి దేవి (మూలా నక్షత్రం),అక్టోబరు 10 - దుర్గాదేవి,అక్టోబరు 11 - మహిషాసుర మర్దిని,అక్టోబరు 12 శ్రీ రాజరాజేశ్వరిదేవి,

## ఇంటింటికీ కుళాయి నీరు అందించే అంశంపై చర్చ




విశాఖపట్నం జిల్లా (నేటి శుభోదయ): రూరల్ వాటర్ సప్లై, జల్ జీవన్ మిషన్ పై సీఎం చంద్రబాబు సమీక్ష.. హాజరైన డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్.. ఇంటింటికీ కుళాయి నీరు అందించే అంశంపై చర్చ. కేంద్ర నిధులను పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసుకుని ఇంటింటికీ తాగు నీరు అందించేలా కసరత్తు.

## ప్రపంచ మహిళా బాక్సింగ్ లో గోల్డ్ మెడల్ సాధించిన నిఖత్ జరీన్




విశాఖపట్నం జిలా(నేటి శుభోదయ): ప్రపంచ మహిళా బాక్సింగ్ లో గోల్డ్ మెడల్ సాధించిన నిఖత్ జరీన్ డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ గా బాధ్యతలు స్వీకరించారు.

## సైబరాబాద్ ఎస్వోటీ పోలీసుల అదుపులో

కొరియోగ్రాఫర్ జానీ మాస్టర్..



విశాఖపట్నం జిల్లా (నేటి శుభోదయ): బెంగళూరులో అదుపులోకి తీసుకున్న పోలీసులు.. ఐదు రోజులుగా పోలీసులకు దొరక్కుండా దాక్కున్న జానీ.. లద్దాక్, నెల్లూరులో గాలించిన పోలీసులు.. బెంగళూరులో ఉన్నట్లు గుర్తించి అదుపులోకి తీసుకున్న పోలీసులు

## ఏపీలో నేటి నుంచి ఉచిత ఇసుక ఆన్లైన్ బుకింగ్



విశాఖపట్నం జిల్లా**(నేటి శుభోదయ):** ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలో గురువారం నుంచి ఉచిత ఇసుక ఆన్లైన్ బుకింగ్ విధానం అమలు కానుంది. దీనికి సంబంధించి సీఎం చంద్రబాబు ఈరోజు ఉచిత ఇసుక పోర్టల్ ఆవిష్కరించనున్నారు దీంతో గ్రామ, వార్డు సచివాలయాల్లో ఇసుక బుక్ చేసుకునే అవకాశం ఉంది. అధికారుల నుంచి ఇసుక రవాణాదారుల వరకు ఎలాంటి తప్పులు చెయ్యకుండా పోర్టల్ రూపకల్పన చేశారు. జిల్లాస్థాయిలో కలెక్టర్ అధికారుల నేతృత్వంలో కమిటీలు వేశారు.

## మరో పథకానికి పేరు మార్చిన ఏపీ ప్రభుత్వం

వైఎస్ఆర్ లా నేస్తం' పథకాన్ని 'న్యాయ మిత్ర'గా మార్పు

ఆదేశాలు జారీ చేసిన ఏపీ ప్రభుత్వం



విశాఖపట్నం జిల్లా**(నేటి శుభోదయ):** ఏపీలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గత ప్రభుత్వ హయాంలో ఉన్న పథకాల పేర్ల మార్పు ప్రక్రియను కొనసాగిస్తూనే ఉంది. తాజాగా వైఎస్ఆర్ లా నేస్తం పథకం పేరును న్యాయ మిత్రగా మార్పు చేస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు న్యాయశాఖ కార్యదర్శి (ఎఫ్ఏసీ) వి. సునీత బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ పథకానికి సంబంధించి మార్గదర్శకాలను త్వరలో జారీ చేయనున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. న్యాయ మిత్ర పథకం ద్వారా జూనియర్ న్యాయవాదులకు స్టైఫండ్ అందించనున్నారు. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో అంతకు ముందున్న పథకాల పేర్లను మార్చిన విషయం తెలిసిందే. వైఎస్ జగన్ అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రభుత్వ పథకాలకు వైఎస్ఆర్, జగనన్న పేర్లు పెట్టి కొనసాగించారు. ఇప్పుడు జగన్ హయాంలో పథకాలకు ఉన్న పేర్లను కూటమి ప్రభుత్వం మార్పు చేస్తోంది. ఈ క్రమంలో ఇప్పటికే జగనన్న విద్యాకానుక పథకాన్ని సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్రగా, జగనన్న విద్యాదీవెన, వసతి దీవెన పథకాలకు పోస్టు మెట్రిక్ స్కాలర్ షిప్, అంబేద్కర్ ఓవర్సీస్ విద్యా నిధిగా, జగనన్న గోరు ముద్దను డొక్కా సీతమ్మ మధ్యాహ్న బడి భోజనంగా, జగనన్న ఆణిముత్యాలు పథకాన్ని అబ్దుల్ కలాం ప్రతిభా పురస్కారంగా, వైఎస్ఆర్ కళ్యాణమస్తు పథకాన్ని చంద్రన్న పెళ్లి కానుకగా, వైఎస్ఆర్ విద్యా వసతి పేరును ఎన్టీఆర్ విద్యావసతిగా, జగన్ సివిల్ సర్వీసెస్ ప్రోత్సాహకం పేరును సివిల్ సర్వీసెస్ పరీక్షల ప్రోత్సాహకాలుగా, జగనన్న శాశ్వత భూహక్కు - భూరక్షణ పథకాన్ని ఏపీ రీ సర్వే ప్రాజెక్టుగా కూటమి సర్కార్ పేర్లను మార్పు చేసింది.

## అక్టోబర్ 2 నుంచి విద్యార్థులకు దసరా సెలవులు...

పెద్దపల్లి ప్రతినిధి **(నేటి శుభోదయ):** తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. దసరా సెలవులను డిక్లేర్ చేసింది. అక్టోబర్ 2వ తేదీ నుంచి 14వ తేదీ వరకు సెలవులు ప్రకటించింది. ఈ మేరకు తెలంగాణ పాఠశాల విద్యాశాఖ అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది. 15వ తేదీ నుంచి యధావిధంగా స్కూల్స్ ప్రారంభమవుతాయని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. 2024 లో దసరా పండుగ అక్టోబర్ 12వ తేదీన వచ్చింది. దీనికి ముందు బతుకమ్మ సంబరాలు తొమ్మిరోజుల పాటు కొనసాగనున్నాయి.ఎంగిలి పూల బతుకమ్మ పండుగ అక్టోబర్ 2వ తేదీన చేస్తారు. ఆ తరువాత దుర్గాష్టమి రోజున సద్దుల బతుకమ్మతో ఈ సంబరాలు ముగుస్తాయి. అంటే దసరాకు రెండు రోజుల ముందు సద్దుల బతుకమ్మ పండుగను ప్రజలు చేసుకోనున్నారు. ఇందులో భాగంగా 2 నుంచి 14 వరకు విద్యార్థులకు సెలవులను రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది.

## మద్యం షాపు దరఖాస్తు రుసుం రూ.2 లక్షలు



విశాఖపట్నం జిల్లా**(నేటి శుభోదయ):** ఏపీలో నూతన మద్యం పాలసీలో భాగంగా 3,736 లిక్కర్ షాప్లో 10 శాతం (340) గీత కార్మికులకు రిజర్వ్ చేస్తారు. దరఖాస్తు రుసుం రూ.2 లక్షలు.లాటరీ విధానం లో రెండేళ్ల కాలపరిమితితో షాపులు కేటాయిస్తారు. ఉ.10 నుంచి రా.10 వరకు షాపులకు అనుమతి ఉంటుంది. జనాభా ఆధారంగా లైసెన్స్ ఫీజు రూ.50-85 లక్షలు చెల్లించాలి. 12 ప్రధాన పట్టణాల్లో 12 ప్రీమియం లిక్కర్ స్టోర్లు ఏర్పాటు చేస్తారు.

## మాజీ మంత్రి విడదల రజినిపై ఫిర్యాదు




విశాఖపట్నం జిల్లా**(నేటి శుభోదయ):** మాజీ మంత్రి విడదల రజినిపై ఫిర్యాదు వైసీపీ కీలక నేత, మాజీ మంత్రి విడదల రజినిపై పల్నాడు జిల్లా స్టోన్ క్రషర్ యాజమాన్యం ఫిర్యాదు చేసింది. విడదల రజిని అక్రమాలపై యడ్లపాడు బాలాజీ స్టోన్ క్రషర్ యాజమాన్యం హోం మంత్రి అనితకు ఫిర్యాదు చేశారు. సానుకూలంగా స్పందించిన ఆమె.. రజిని అక్రమాలపై విచారణకు ఆదేశించారు.

## తెలంగాణ యంగ్ ఇండియా స్కిల్ యూనివార్సిటీ....



పెద్దపల్లి ప్రతినిద్ది**(నేటి శుభోదయ):** రాష్ట్రంలో కొత్తగా ఏర్పాటు చేసిన తెలంగాణ యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీని దేశంలోనే ఆదర్శంగా తీర్చిదిద్దాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పారు. ఆ బాధ్యతను యూనివర్సిటీ బోర్డుకు అప్పగిస్తున్నట్లు ప్రకటించారు. యూనివర్సిటీకి 150 ఎకరాల స్థలంతో పాటు ప్రభుత్వం రూ. 100 కోట్లు కేటాయించినట్లు తెలిపారు. ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన స్కిల్ యూనివర్సిటీకి రాష్ట్రంలోని పారిశ్రామికవేత్తలు, ప్రముఖ కంపెనీలు భాగస్వామ్యం కావాలని కోరారు. యూనివర్సిటీ బోర్డుతో పాటు రాష్ట్రంలోని వివిధ రంగాలకు చెందిన పారిశ్రామికవేత్తలు, కంపెనీల ప్రతినిధులతో ముఖ్యమంత్రి సచివాలయంలో సమావేశమయ్యారు. ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క,పరిశ్రమలు ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు,యూనివర్సిటీ బోర్డు చైర్మన్, మహీంద్రా అండ్ మహీంద్రా గ్రూపు చైర్మన్ ఆనంద్ మహీంద్రా, కో-చైర్మన్ శ్రీని రాజు, బోర్డు సభ్యులు పాల్గొన్నారు. రాష్ట్రంలోని పారిశ్రామికవేత్తలు స్కిల్ యూనివర్సిటీ లో భాగస్వామ్యం పంచుకోవాలని, యూనివర్సిటీ పూర్తి స్థాయి నిర్వహణకు కార్పస్ ఫండ్ ఏర్పాటుకు ముందుకు రావాలని కోరారు. యూనివర్సిటీలో భవనాల నిర్మాణానికి ముందుకు వచ్చిన కంపెనీలు లేదా దాతల పేర్లను ఆ భవనాలకు పెట్టాలని అధికారులకు సూచించారు. స్కిల్ యూనివర్సిటీకి సంబంధించి ఆలోచన, ఆశయాలతో పాటు పలు కీలక అంశాలను మంత్రి శ్రీధర్ బాబు గారు సమావేశంలో వివరించారు. యూనివర్సిటీలో కోర్సులు ఈ ఏడాది నుంచే ప్రారంభించాలని యూనివర్సిటీ బోర్డు నిర్ణయించింది. దసరా పండుగ తర్వాత అక్టోబర్ నెలలో కోర్సులను ప్రారంభించనున్నట్లు సూచన ప్రాయంగా వెల్లడించింది. ఈ సమావేశం లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి బట్టీవిక్రమార్క, రాష్ట్ర ఐటి పరిశ్రమల, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు లతో పాటు రాష్ట్ర ఉన్నతధికారులు, కంపెనీ ప్రతినిధులు పాల్గొన్నారు.

## టార్గెట్ మార్చిన హైడ్రా.. కూల్చివేతలు ఎక్కడంటే..!




**హైదరాబాద్, :** హైదరాబాద్ లోని చెరువులు, ప్రభుత్వ భూములు పరిరక్షణగా ఏర్పాటైన హైడ్రా.. దూసుకెళ్తోంది. ఇప్పటికే చెరువుల్లోని బఫర్, ఎఫ్టీఎల్ లో ఉన్న నిర్మాణాలను కూల్చివేసిన సంగతి తెలిసిందే. కొద్ది రోజులుగా హైడ్రా స్పీడ్ తగ్గించింది. తాజాగా లేక్ వ్యూ పేరుతో ప్రజలను ఆకర్షితులను చేస్తున్నారు. చాలా మంది బిల్డర్లు, చెరువులను అక్రమించి లేదా చెరువుల బఫర్ జోన్, ఎఫ్టీల్ లో అపార్ట్ మెంట్లు నిర్మించి లేక్ వ్యూ అని ప్రచారం చేసుకుంటున్నాయి. ఇప్పుడు హైడ్రా ఇలాంటి ప్రాజెక్టులపై విచారణ చేయనుంది. ఈ ప్రాజెక్టులు బఫర్ లోజన్, ఎఫ్టీఎల్ లో ఉన్నాయా లేదా చెక్ చేయనుంది. హైడ్రా విచారణ చేసే జాబితాలో సాధారణ ప్రాజెక్టులతో పాటు బడా నిర్మాణ సంస్థలకు చెందిన 'లేక్ వ్యూ' ప్రాజెక్టులు ఉన్నట్లు తెలుస్తోంది. హైడ్రా చర్యలతో చెరువులకు దగ్గర ఉన్న నిర్మాణాల్లో కొనుగోలు చేసేందుకు కస్టమర్లు భయపడుతున్నారు. హైడ్రా త్వరగా విచారణ పూర్తి చేస్తే ఏ ప్రాజెక్టు బఫర్ జోన్, ఎఫ్టీఎల్ లో ఉందో తెలుసుకోవచ్చు. దీంతో పాటు హైడ్రా హుస్సేన్ సాగర్ పై ఫోకస్ పెట్టనట్లు తెలుస్తోంది. థ్రిల్ సిటీ, జలవహార్ హుస్సేన్ సాగర్ ఎఫ్టీఎల్ లో నిర్మించారని హైడ్రాకు భారీగా ఫిర్యాదులు వెళ్లాయి. హుస్సేన్ సాగర్ పక్కకు నిర్మించిన జలవిహార్ పై చర్యలు తీసుకోవాలని తాజాగా సీపీఐ నేతలు హైడ్రాకు ఫిర్యాదు చేశారు. సీపీఐ జాతీయ నేత, మాజీ ఎంపీ అజీజ్ పాషా ఫిర్యాదు చేసిన వారిలో ఉన్నారు. స్సేన్ సాగర్ బఫర్ జోన్, ఎఫ్టీఎల్ 12.5 ఎకరాల్లో జలవిహార్ ఉందని వారు పేర్కొన్నారు. హుస్సేన్ సాగర్ ఎఫ్టీఎల్, బఫర్ జోన్ పరిధి జలవిహార్ నిర్మాణాన్ని వ్యతిరికిస్తూ ఫోరమ్ ఫర్ బెటర్ హైదరాబాద్ కోర్టును ఆశ్రయించినట్లు గుర్తు చేశారు. అలాగే థ్రిల్ సిటీ పై కూడా చర్యలు తీసుకోవాలని డిమాండ్లు వస్తున్నాయి. దీంతో హైడ్రా హుస్సేన్ సాగర్ పై దృష్టి పెట్టే అవకాశం ఉందని తెలుస్తోంది. 2007లో అప్పటి ప్రభుత్వం జలవిహార్ ఏర్పాటు చేసుకునేందుకు 30 ఏళ్ల పాటు భూమిని లీజ్ కు ఇచ్చింది.

## నవంబర్10లోగా బీసీ గణన పూర్తి చేయాలి : కేటీఆర్



**హైదరాబాద్, :** వచ్చే నవంబర్ 10వ తేదీలోగా బీసీ గణన పూర్తి చేయాలని బీఆర్ఎస్ వర్కింగ్ కేటీఆర్ డిమాండ్ చేశారు. కామారెడ్డి బీసీ డిక్లరేషన్ ను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయాల్సిందేనన్నారు. అమలు జరిగే వరకు కాంగ్రెస్ సర్కారును నిలదీస్తామని.. 42శాతం రిజర్వేషన్లు అమలు చేయాల్సిందేనన్నారు. బుధవారం తెలంగాణ భవన్లో బీఆర్ఎస్ బీసీ నేతలతో కేటీఆర్ సమావేశం నిర్వహించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్ బీసీ డిక్లరేషన్ పేరుతో చేసిన మోసంపై పార్టీకి సంబంధించిన బీసీ నేతలతో చర్చించినట్లు తెలిపారు. వెంటనే సమగ్ర కులగణన ప్రారంభించి.. నవంబర్ 10వ తేదీలోగా పూర్తి చేయకుంటే బీసీల తరపున ఎలా ముందుకువెళ్తామన్న దానిపై కార్యాచరణ ప్రకటిస్తామన్నారు. అవసరమైతే ప్రత్యక్ష ఆందోళనకు దిగుతామని కేటీఆర్ హెచ్చరించారు. బీసీలకు రూ.లక్ష కోట్ల బడ్జెట్ ఇస్తామని చెప్పి రూ. 8వేలకోట్లు మాత్రమే బడ్జెట్‌లో పెట్టారని విమర్శించారు. బీసీ సబ్‌ప్లాన్ తీసుకురావాలన్నారు. రూ. 25వేల నుంచి రూ. 35వేలకోట్లు పెట్టాలన్నారు. స్థానిక సంస్థల్లో బీసీల వాటా పెంచాలన్నారు. ఎంబీసీలకు మంత్రిత్వశాఖ ఏర్పాటు చేస్తామన్నారని.. హామీ ఇచ్చిన మేరకు మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కేబినెట్‌లో ఇద్దరు మాత్రమే బీసీ మంత్రులు ఉన్నారన్నారు. నేతన్నలు సంక్షోభంలో ఉన్నారని.. చేపపిల్లల పంపిణీ ఆపేసి గంగపుత్రుల పొట్టగొడుతున్నదని ధ్వజమెత్తారు. బలహీన వర్గాల సమస్యల పరిష్కారం కోసం బీఆర్ఎస్ పోరాడుతుందన్నారు. బీసీ డిక్లరేషన్‌లోనే దాదాపు దాదాపు 70 హామీలు ఉన్నాయని, బీసీల కోసం బీఆర్ఎస్ కదిలిందన్నారు. రాష్ట్రంలోని బలహీన వర్గాలకు పెద్దదిక్కుగా బీఆర్ఎస్ ఉంటుందన్నారు. రిటీ ఇవ్వాలన్నారు. వచ్చే ఎన్నికల కోసం దేశంలోని అన్ని ప్రభుత్వాల జమిలి ఎన్నికలపై కేంద్ర ప్రభుత్వం క్లాను రద్దు చేస్తారా? బీఆర్ఎస్ నేత ప్రశ్నించారు. ఈ జమిలీ ఎన్నికలపై పార్టీ నేతలమంతా కూర్చొని చర్చించి నిర్ణయిస్తామన్నారు.

## వైరల్ అవుతోన్న నాగబాబు ట్వీట్స్.. ఎవరికోసం ఆ కొటేషన్‌లు?



**హైదరాబాద్, :** గత కొద్దిరోజులుగా ప్రముఖ కొరియోగ్రాఫర్ జానీ మాస్టర్ అలియాస్ షేక్ జానీ బాషా పేరు టాలీవుడ్‌లో మార్మోగిపోతోన్న విషయం తెలిసిందే. తనపై పలుమార్లు అత్యాచారం చేశాడంటూ ఓ మహిళా అసిస్టెంట్ కొరియోగ్రాఫర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు జానీ మాస్టర్‌పై కేసు నమోదు చేసుకున్న పోలీసులు.. నేడు ఉదయం బెంగళూరులో అతడిని అదుపులోకి తీసుకున్నారు. సైబరాబాద్ ఎస్‌వోటీ పోలీసు బృందం అతడిని బెంగళూరు నుంచి హైదరాబాద్ తీసుకొస్తున్నారు. జానీ మాస్టర్ అరెస్టైన వేళ సినీ నటుడు నాగబాబు చేసిన ట్వీట్స్ సోషల్ మీడియాలో చర్చకు దారితీశాయి. 'న్యాయస్థానంలో నేరం రుజువయ్యే వరకు ఏ వ్యక్తిని నేరానికి పాల్పడినట్లుగా పరిగణించలేరు' అని బ్రిటిష్ లాయర్ సర్ విలియం గారో కొటేషన్‌ను నాగబాబు రాసుకొచ్చారు. 'మీరు విన్న ప్రతిదాన్ని నమ్మవద్దు. ప్రతి కథకు మూడు పార్శ్వాలు ఉంటాయి. మీ వైపు, నా వైపు మరియు నిజం' అని అమెరికా జర్నలిస్ట్ రాబర్ట్ ఎవాన్స్ రాసిన కొటేషన్‌ను మరో ట్వీట్‌లో పేర్కొన్నారు. ఈ రెండు ట్వీట్‌లలో జానీ మాస్టర్ గురించి నాగబాబు ఏమీ మాట్లాడకపోయినా.. వాటి అర్థాలను చూస్తే జానీ కోసమే వేసినట్టు ఉంది. సర్ విలియం గారో, రాబర్ట్ ఎవాన్స్ కొటేషన్‌లను నాగబాబు ట్వీట్ చేయడంతో నెట్టింట పెద్ద చర్చ మొదలైంది. ఇందుకు కారణం లేకపోలేదు. జానీ మాస్టర్ జనసేన పార్టీలో కీలకంగా వ్యవహరించిన సంగతి తెలిసిందే. అంతేకాదు మెగా ఫ్యామిలీతో కూడా ఆయనకి సన్నిహిత సంబంధాలు ఉన్నాయి. జానీ మాస్టర్‌కు నాగబాబు మద్దతు ఇచ్చారని నెటిజెన్స్ కామెంట్స్ చేస్తున్నారు.ఁ

## చౌకగా లభిస్తోన్న ముడి చమురు



**న్యూఢిల్లీ,:** రష్యా ముడిచమురు ఇప్పటికీ తక్కువ ధరకే లభిస్తుందని కేంద్రమంత్రి హర్దీప్ సింగ్ పురి అన్నారు. దాంతో రష్యన్ కంపెనీల నుంచి క్రూడాయిల్ కొనుగోలు చేయడానికి సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. ఉక్రెయిన్‌తో యుద్ధం కారణంగా రష్యా ముడిచమురు దిగుమతులపై పాశ్చాత్య దేశాలు ఆంక్షలు విధించిన విషయం తెలిసిందే. దాంతో రష్యా తక్కువ ధరకు క్రూడాయిల్ విక్రయిస్తోంది. భారత్ తన చమురు అవసరాల్లో 88 శాతం దిగుమతులపైనే ఆధారపడుతోంది. ప్రపంచంలోని అతిపెద్ద ఇంధన వినియోగదారుల్లో భారత్ ఒకటిగా ఉంది. దేశీయంగా వార్షిక ముడిచమురు శుద్ధి సామర్థ్యం సుమారు 252 మిలియన్ మెట్రిక్ టన్నులుగా ఉంది. అంటే రోజుకు 50.04 లక్షల బ్యారెల్స్ శుద్ధి చేసే కెపాసిటీ కలిగి ఉంది. భవిష్యత్తులో ఇంధన వినియోగం పెరగనుందని మంత్రి అన్నారు. అందుకు అనుగుణంగా సంవత్సరానికి 300 మిలియన్ మెట్రిక్ టన్నుల (రోజూ 60 లక్షల బ్యారెల్స్) వరకు చమురు శుద్ధి చేసేలా కర్మాగారాల సామర్థ్యాన్ని పెంచే ప్రాజెక్ట్‌లు అమలులో ఉన్నాయని తెలిపారు. ఫిబ్రవరి 2022లో ఉక్రెయిన్-రష్యాల మధ్య నెలకొన్న భౌగోళిక అనిశ్చితుల వల్ల యూరప్ దేశాలు రష్యా క్రూడ్ దిగుమతిపై ఆంక్షలు విధించాయి. దాంతో రష్యా చమురు ధరను తగ్గించడంతోపాటు రూపాయిల్లో ట్రేడ్ చేసుకునేందుకు వీలు కల్పించింది. ఇతర దేశాల నుంచి పోలిస్తే రష్యా చమురు దిగుమతి భారత్‌కు కలిసివచ్చింది. చైనా కూడా రష్యా చమురు వాడకాన్ని పెంచింది. ఈ పరిణామాల వల్ల ప్రస్తుతం భారత్‌కు అతిపెద్ద చమురు సరఫరాదారుగా రష్యా ఉద్భవించింది. ఉక్రెయిన్‌తో యుద్ధానికి ముందు భారత్‌కు చమురు దిగుమతిలో రష్యా వాటా 1 శాతం కంటే తక్కువే ఉండేది. క్రమంగా అది పెరుగుతూ దాదాపు 40 శాతం వాటాకు చేరింది.

# సరైన దిశలో తొలి అడుగు



కోర్టు నోరు విప్పిందంటే న్యాయం నిలబడుతుందని సామాన్యులకు ఆశ. దేశంలో చట్టాలను తుంగలో తొక్కుతున్న బుల్‌డోజర్ సంస్కృతిపై మంగళవారం దేశ సర్వోన్నత న్యాయస్థానం ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులు కాసింతైనా సంతోషం కలిగిస్తున్నది అందుకే. అనేక రాష్ట్రాలలో క్రిమినల్ కేసుల్లో దర్యాప్తును ఎదుర్కొంటున్న నిందితులు, వారి కుటుంబ సభ్యుల ప్రైవేట్ గృహాలు, ఆస్తు లపై బుల్‌డోజర్లను నడిపిస్తూ... 'దాన్ని ఘనకార్యంగా పేర్కొంటూ, సమర్థించుకుంటున్న' వైఖరి పాలకుల సాక్షిగా పెచ్చుమీరుతోంది. ఈ పరిస్థితుల్లో తదుపరి విచారణ జరిగే అక్టోబర్ 1 దాకా దేశవ్యాప్తంగా ఈ అడ్డగోలు కూల్చివేతలన్నిటికీ సుప్రీమ్ కోర్ట్ అడ్డుకట్ట వేయడం విశేషం. అదే సమ యంలో నీటి వసతులు, రైల్వే లైన్లకు అడ్డుగానూ, ఫుట్‌పాత్‌లు, ప్రభుత్వ స్థలాల్లోనూ సాగిన దురా క్రమణలనూ, అనధికారిక నిర్మాణాలనూ కూల్చేందుకు అభ్యంతరం లేదని సుప్రీమ్ పేర్కొంది. అలాగే, కూల్చివేతలపై దేశవ్యాప్తంగా అమలయ్యేలా నిర్ణీత మార్గదర్శకాల్ని రూపొందించాలన్న కోర్ట్ ప్రతిపాదన హర్షణీయం. ఇన్నాళ్ళ తరువాత ఇప్పటికైనా ఇది సరైన దిశలో సరైన అడుగు. యోగి ఆదిత్యనాథ్ సారథ్యంలోని ఉత్తరప్రదేశ్‌లో 2017లో ఈ బుల్‌డోజర్ న్యాయానికి బీజం పడింది.

ఆ తరువాత ఇది అనేక బీజేపీ పాలిత రాష్ట్రాలకు పాకింది. ఒక్క ఉత్తరప్రదేశ్‌లోనే ఇప్పటికి 4.5 లక్షల దాకా గృహాలు ఇలా నేలమట్టమయ్యాయని అంచనా. ఇకపై చట్టవిరుద్ధంగా ఒక్క కూల్చివేత జరిగినా అది పూర్తిగా రాజ్యాంగ విధానానికే విరుద్ధమని కోర్ట్ పేర్కొనడం గమనార్హం. నిజానికి, గతంలోనూ కోర్టులు ఇలాంటి వ్యాఖ్యలు చేసినా, వాటి ఆదేశాలను ధిక్కరిస్తూ అనేకచోట్ల కూల్చివేతలు యథేచ్ఛగా సాగాయి. అసలు అనేక రాష్ట్ర ప్రభుత్వాలు చట్టాన్ని చేతుల్లోకి తీసుకొని నిందితుల మీదకు బుల్‌డోజర్‌ను నడిపిస్తున్న తీరుపై చాలా కాలంగా చర్చ జరుగుతోంది. తప్పు చేసినవారిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాల్సింది పోయి, నోటీసులైనా ఇవ్వకుండా, నిర్ణీత ప్రక్రియ ఏదీ పాటించకుండా వారికి శిక్షగా బుల్‌డోజర్‌ను ఉపయోగించడమేమిటనే ధర్మబద్ధమైన ప్రశ్నలు వినిపిస్తూ వచ్చాయి. పైపెచ్చు, ముస్లిమ్‌ల ఇళ్ళను లక్ష్యంగా చేసుకొని కూల్చివేతలు సాగించడమనేది బీజేపీ పాలిత రాష్ట్రాల్లో పాలనా విధానంగా తయారవడం ఆందోళన రేపింది. ఈ పరిస్థితుల్లో జస్టిస్ బి.ఆర్. గవాయ్, కె.వి. విశ్వనాథన్‌లతో కూడిన సుప్రీమ్ కోర్ట్ డివిజన్ బెంచ్ ఈ పద్ధతిని తప్పుబట్టింది. ఒక కేసులో నిందితులైనంత మాత్రానో, లేదంటే దోషి అయినంత మాత్రానో వారి ఇంటిని కూల్చేయవచ్చా? అందుకు చట్టం అనుమతిస్తుందా? లేదు కదా! ఆ మాటే సుప్రీమ్ అంటోంది. పైగా ఇంట్లో ఎవరో ఒకరు నేరం చేస్తే, కూల్చివేతలతో ఆ కుటుంబం మొత్తానికీ శిక్ష విధించడం ఏ రకంగా సబబు? ప్రభుత్వ పాలన నిర్వహించే కార్యనిర్వాహక వ్యవస్థే జడ్జిగా మారి, శిక్షించవచ్చా? ఆక్రమణలనూ, అనధికారిక నిర్మాణాలనూ తొలగించేందుకు వివిధ రాష్ట్రాల్లోని స్థానిక చట్టాలు అనుమతిస్తున్నాయి. కానీ, వాటిని ప్రతిపక్షాల పీక నొక్కేందుకూ, నిర్ణీత వర్గాలపై ప్రతీకారేచ్ఛకూ సాధనంగా మార్చుకోవడంతోనే అసలు సమస్య. గొంతు విప్పిన భార తీయ ముస్లిమ్‌లపై ఉద్దేశపూర్వకంగా సాగుతున్న దాడిలో భాగమే ఈ కూల్చివేతలని చివరకు ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్ సైతం పేర్కొనే పరిస్థితి వచ్చిందంటే తీవ్రతను అర్థం చేసుకోవచ్చు. ఈ బుల్‌డోజర్ న్యాయం దేశంలోని వివిధ ప్రాంతాల్లో వివిధ పద్ధతుల్లో సాగుతున్నా, అన్ని చోట్లా ఒక అంశం మాత్రం సర్వసాధారణం. అది ఏమిటంటే - గతంలో కోర్టులిచ్చిన ఆదేశాలను పట్టించుకోకుండా, నిర్ణీత ప్రక్రియ అంటూ లేకుండానే ఈ కూల్చివేతలు కొనసాగడం! దురాక్రమణ లకు వ్యతిరేకంగా ఉద్యమం అంటూ ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, రాజస్థాన్, హర్యానా, ఢిల్లీ లాంటి చోట్ల ఇటీవలి కూల్చివేతల్లోనూ చట్ట ఉల్లంఘన నిర్భీతిగా సాగింది. గుజరాత్, అస్సామ్, త్రిపురల్లో సైతం కూల్చివేతల పర్వానికి కట్టడి లేకుండా పోయింది. అసాంఘిక శక్తులపై ప్రభుత్వం కఠిన చర్యలకు ఉపక్రమిస్తోందనే భావన కల్పిస్తూ, రాజకీయ లబ్ధి పొందడం అధికార పార్టీల వ్యూహం. దానిలోని మతపరమైన కోణాన్ని కప్పిపుచ్చడం వాటికి వెన్నతో పెట్టిన విద్య. ఈ బుల్‌డోజర్‌సంస్కృతిపై భారత అత్యున్నత న్యాయస్థానం జోక్యానికి ఇంతకాలం పట్టడం విచారకరమే. అయితే, ఇప్పుడిక పనిప్రదేశాల్లో లైంగిక వేధింపులకు వ్యతిరేకంగా 'విశాఖ' మార్గదర్శకాలు చేసినట్టుగానే దీనిపైనా అఖిల భారత స్థాయిలో కోర్టు మార్గదర్శకాలు ఇవ్వనుండడం ఒకింత ఊరట. అనధికారిక నిర్మాణాల గుర్తింపు, నోటీసులివ్వడం, వాదనలు వినడం, అనంతరం చట్టబద్ధంగా కూల్చివేతలు జరపడం... ఈ ప్రక్రియ అంతటికీ దేశవ్యాప్తంగా ఒకే విధమైన నియమావళి ఉండడం కచ్చితంగా మంచిదే. ఇటీవలి కూల్చివేతల డేటాను నిశితంగా సమీక్షిస్తే అనేక లోపాలు కనిపిస్తాయి. అందుకే, ఈ అంశంపై సంబంధిత వర్గాల నుంచి సూచనలు కోరుతున్న కోర్ట్ రేపు మార్గదర్శకాల రూపకల్పనలోనూ జాగ్రత్తగా వ్యవహరించడం కీలకం. మత ఘర్షణలు, ఆ వెంటనే సాగే కూల్చి వేతల మధ్య సంబంధాన్ని కప్పిపుచ్చేందుకు పాలకులు ఎత్తులు వేయడం తరచూ చూస్తున్నాం. ఆ పన్నాగాలు పారనివ్వకుండా మార్గదర్శకాల తయారీ అవసరం. అలాగే, ఎప్పుడో నోటీసులు ఇచ్చా మని మభ్యపెట్టేందుకు వెనకటి తేదీలతో కాగితాలు చూపించి, పాలనా యంత్రాంగం ఇష్టారీతిన సాగించే కూల్చివేతలకు చెక్ పెట్టాలి. సహజ న్యాయసూత్రాలకు విరుద్ధంగా జరిగే ఏ చర్యలనూ అనుమతించని రీతిలో నియమావళిని కట్టుదిట్టంగా రూపొందించాలి. ఆదేశాల ఉల్లంఘనను తీవ్రంగా పరిగణించి, కోర్టు ధిక్కారం కింద కఠిన చర్యలు చేపట్టాలి. ప్రజలెనుకున్న పాలకులు తామే జడ్జీలుగా, తామే శిక్షలు అమలు చేసేవారిగా ప్రవర్తిస్తే అది పౌరుల ప్రాథమికహక్కులకే భంగకరం.

## లెబనాన్‌లో మళ్లీ అనూహ్య పేలుళ్లు 14 మంది దుర్మరణం 450 మందికి గాయాలు

### ఇజ్రాయెల్ కొత్త యుద్ధ తంత్రం

# నిన్న పేజర్లు నేడు వాకీ టాకీలు





బీరుట్: వాకీటాకీలు, సౌర విద్యుత్ వ్యవస్థల పేలుళ్లతో లెబనాన్ దద్దరిల్లింది. గాజా స్ట్రిప్‌పై భీకర భూతల, గగనతల దాడులతో తెగబడిన ఇజ్రాయెల్ తాజా తన లక్ష్యాన్ని లెబనాన్ వైపు తిప్పిందని బుధవారం నాటి అనూహ్య పేలుళ్ల స్పష్టమైంది. హెజ్‌బొల్లా సాయుధులు విరివిగా వాడే పేజర్‌లు పేలి 24 గంటలు గడవకముందే లెబనాన్‌లో బుధవారం వాకీటాకీలు, సౌరవిద్యుత్ వ్యవస్థలు పేలిపోయాయి. ఈ అనూహ్య పేలుళ్ల ఘటనల్లో 14 మంది ప్రాణాలు కోల్పోయారు. 450 మంది గాయాలపాలయ్యారు. మృతులు, క్షతగాత్రుల సంఖ్య మరింతగా పెరిగే అవకాశం ఉంది. పేజర్‌ల పేలుళ్లతో 13 మంది చనిపోయి 2,800 మంది రక్తమోడిన తరుణంలో మరో 'సాంకేతిక' పేలుళ్ల పర్వానికి దిగి ఇజ్రాయెల్ కొత్త యుద్ధతంత్రానికి తెరలేపిందని అంతర్జాతీయంగా విశ్లేషణలు వెల్లువెత్తాయి. గాజా స్ట్రిప్‌లో దాదాపు మొత్తం భూభాగాన్ని జల్లెడపట్టిన ఇజ్రాయెల్ ఇప్పుడు తన లక్ష్యాన్ని లెబనాన్‌కు మార్చుకుందని తాజా ఉదంతం చాటుతోంది.

### అంతిమయాత్ర వేళ పేలుళ్లు

పేజర్‌ల పేలుళ్లలో మరణించిన ముగ్గురు హెజ్‌బొల్లా సభ్యులు, ఒక చిన్నారి అంతిమయాత్రలు బీరుట్ శివారులోని దహియేలో కొనసాగుతున్నపుడే వాకీటాకీలు పేలడం గమనార్హం. "బీరుట్‌లో చాలా చోట్ల వాకీటాకీలు పేలాయి. ఎలక్ట్రానిక్ పరికరాలు పేలిన ఘటనల్లో 9 మంది చనిపోయారు" అని లెబనాన్ ఆరోగ్య శాఖ బుధవారం ప్రకటించింది. బీరుట్ నగరంతోపాటు లెబనాన్‌లో చాలా చోట్ల పేలుళ్లు జరిగాయని హెజ్‌'ల్లా ప్రతినిధులు చెప్పారు. వాయవ్య తీర పట్టణమైన సిడాన్‌లో ఒక కారు, ఒక మొబైల్ ఫోన్ దుకాణం వాకీటాకీల పేలుడుకు ధ్వంసమైన వీడియోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి. రక్తమోడుతూ వందలాది మంది ఆస్పత్రులకు పోటెత్తుతున్న దృశ్యాలు స్థానిక మీడియాలో కనిపించాయి. "ఇలాంటిది నేనెప్పుడూ చూడలేదు. గాయపడిన వారిలో చాలా మందికి చేతివేళ్లు తెగిపోయాయి. కళ్లు దెబ్బతిన్నాయి" అని బీరుట్‌లోని దీయూ ఆస్పత్రిలో వైద్యురాలు నౌర్ ఎల్ ఓస్తా చెప్పారు. " వరుస అనూహ్య పేలుళ్లతో ఇజ్రాయెల్, హెజ్‌బొల్లాలు పూర్తిస్థాయి యుద్ధానికి ఆజ్యంపోస్తున్నాయి' అని అమెరికా విదేశాంగ మంత్రి ఆంటోనీ బ్లింకెన్ బుధవారం ఆందోళన వ్యక్తంచేశారు.

### దాడికి ఇదే సరైన సమయమా?

వేలాది మంది హెజ్‌బొల్లా సైనికులు గాయాలపాలై ఆస్పత్రులకు పరిమితమయ్యారు. పేజర్‌ల పేలుడుతో హెజ్‌బొల్లాలో కమ్యూనికేషన్ నెట్‌వర్క్ కోలుకోనంతగా దెబ్బతింది. వాకీటాకీలు, సోలార్ వ్యవస్థల పేలుళ్లతో పౌరుల్లో ఆందోళనల నడుమ దేశంలో శాంతిభద్రతలపై లెబనాన్ దృష్టిపెట్టాల్సిఉంది. ఈ తరుణంలో దాడి చేస్తే శత్రువును భారీగా దెబ్బ కొట్టవచ్చని ఇజ్రాయెల్ భావిస్తున్నట్లు తెలుస్తోంది. తమ గడ్డపై వరుస పేలుళ్లతో ఆగ్రహించిన లెబనాన్, హెజ్‌బొల్లా సాయుధాలు దాడులకు తెగబడొచ్చన్న ఇజ్రాయెల్ భావించింది. దీంతో ముందస్తు జాగ్రత్తగా లెబనాన్ సరిహద్దు ప్రాంతాలకు ఇజ్రాయెల్ అదనపు బలగాలను తరలించింది. అక్టోబర్ 8న గాజా స్ట్రిప్‌పై ఇజ్రాయెల్ దమనకాండ మొదలైననాటి నుంచి ఇజ్రాయెల్‌పైకి హెజ్‌బొల్లా రాకెట్, డ్రోన్ దాడులు చేస్తోంది.

### ఉద్రిక్తతలను ఆపండి: ఐరాస

లెబనాన్ వాకీటాకీల పేలుళ్ల ఘటనపై ఐక్యరాజ్యసమితి ఆందోళన వ్యక్తచేసింది. " పరిస్థితి చేయిదాట కుండా ఇరు పక్షాలు సంయమనం పాటించాలి" అని ఐక్యరాజ్యసమితి ప్రధానకార్యదర్శి ఆంటోనియో గుటెరస్ అన్నారు. " బందీలను విడిచిపెట్టి శాంతి స్థాపనకు కట్టుబడాలి. ఎలక్ట్రానిక్ పరికరాల పేలుళ్లకు పాల్పడటం చూస్తుంటే ఇది భారీ సైనిక చర్యకు కసరత్తులా తోస్తోంది" అని గుటెరస్ వ్యాఖ్యానించినట్లు ఆయన అధికార ప్రతినిధి స్టీఫెన్ డ్యుజారిక్ చెప్పారు.

### యుద్ధంలో కొత్త దశ మొదలైంది: ఇజ్రాయెల్

వాకీటాకీల ఉదంతం తర్వాత రమాట్ డేవిడ్ వైమానిక స్థావరంలో ఇజ్రాయెల్ రక్షణ మంత్రి యావ్ గాలంట్ మాట్లాడారు. " యుద్ధంలో కొత్త దశకు తెరలేపుతున్నాం. యుద్ధక్షేత్ర కేంద్ర స్థానం ఉత్తరం నుంచి దిశ మార్చుకుంటోంది. మాకు ఇప్పుడు స్థిరత్వం అవసరం. బలగాలు, వనరులను వేరే లక్ష్యం వైపు వినియోగించే అవకాశముంది. బుధవారం అద్భుత ఫలితాలు సాధించాం" అని సైనికులనుద్దేశించి ప్రసంగించారు. ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహూ అత్యున్నత స్థాయి భద్రతాధికారులతో అత్యవసరంగా సమావేశమయ్యారు. హెజ్‌బొల్లాపై అదనపు దాడులకు సిద్ధమవుతున్నామని చెప్పారు. దీంతో లెబనాన్‌తో పూర్తిస్థాయి యుద్ధానికి ఇజ్రాయెల్ సమాయత్తమవుతోందని అర్థమవుతోంది. కాగా, వరుస పేలుళ్లపై స్వతంత్ర్య దర్యాప్తు జరపాలని ఐరాస మానవహక్కుల సంస్థ చీఫ్ వోకర్ టర్క్ డిమాండ్‌చేశారు.

# కాకూడదు.సం'క్షామం'



'సంక్షేమం, అభివృద్ధి ఈ రెండూ మా ప్రభుత్వానికి రెండు కండ్లు. వాటిని జోడెద్దుల్లాగా పరుగులు పెట్టిస్తాం' సరిగ్గా 20 ఏండ్ల క్రితం కాంగ్రెస్ను అధికారంలోకి తెచ్చిన వైఎస్ రాజశేఖరరెడ్డి అన్న మాటలివి. తెలంగాణ ఏర్పడ్డాక దశాబ్ద కాలంపాటు అధికార పీఠానికి దూరంగా ఉన్న ఆ పార్టీని గద్దెమీద కూర్చోబెట్టిన ముఖ్యమంత్రి రేవంత్రెడ్డి సైతం తొమ్మిది నెలల క్రితం అవే మాటలను వల్లెవేశారు. ఇందిరమ్మ రాజ్యంలో ఇంటింటా సంక్షేమం, ప్రజా పాలనలో అందరి సమస్యలనూ పరిష్కరిస్తామంటూ ఆయన భరోసానిచ్చారు. ఆ మేరకు హైదరాబాద్లోని ప్రజాభవన్ (ప్రగతి భవన్)తో పాటు జిల్లాల్లోనూ 'ప్రజావాణి' కార్యక్రమాలను నిర్వహిస్తున్న సంగతి విదితమే. ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించటం, వాటిని కంప్యూటరీకరించటం, మెసేజ్ల రూపంలో రశీదు (ఎక్నాలెడ్జ్మెంట్) లనివ్వటం వరకూ ఓకే. కానీ ఆ తర్వాతే కథ ముందు కు సాగటం లేదని వినికిడి. రేషన్ కార్డులకు సంబంధించి తాజాగా ప్రభుత్వం ప్రకటించిన ఓ నిర్ణయమే అందుకు ప్రత్యక్ష ఉదాహరణగా నిలుస్తోంది. రేవంత్ సర్కారు కొలువుదీరిన కొత్తలోనే ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డులు, 200 యూనిట్ల వరకూ ఉచిత కరెంటు, రూ.500కే గ్యాస్ సిలిండర్ తదితరాంశాల కోసం నెల రోజులపాటు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించిన విషయం మనకు ఎరుకే. ఆ తర్వాత రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన ప్రజావాణి ద్వారా మొత్తం 55 వారాల్లో 5.30 లక్షల దరఖాస్తులు అందినట్టు సర్కార్ వెల్లడించింది. హైదరాబాద్లోని ప్రజా భవన్లో ప్రతి మంగళ, శుక్రవారాల్లో నిర్వహిస్తున్న ఆ కార్యక్రమానికి ఇప్పటి వరకూ 66 వేల అర్జీలు వచ్చాయన్నది అధికారిక వర్గాల లెక్క. వీటిలో అత్యధికం ఇండ్లు, రేషన్ కార్డులు, పింఛన్లు, ఉపాధి కల్పనకు సంబంధించినవే ఉండటం గమనార్హం. ఆయా దరఖాస్తుల్లో లక్షకు పైగా పెండింగ్లో ఉన్నాయనే విషయాన్ని అదే అధికారులు విడుదల చేసిన బులెటిన్ చెబుతోంది. పరిస్థితి ఈ విధంగా ఉన్నప్పుడు ఉన్న దరఖాస్తులను పరిశీలించి, పరిష్కరించాల్సిన ప్రభుత్వం అందుకు భిన్నంగా మీనమేషాలు లెక్కిం చటం విడ్డూరం. అక్టోబరులో రేషన్ కార్డుల ప్రక్రియ ప్రారంభిస్తామంటూ మంత్రివర్గ ఉపసంఘం చెప్పటం మరీ హాస్యాస్పదం. అంటే ఇప్పటి వరకూ వచ్చిన దరఖాస్తులను ఇంతవరకూ చూడలేదా? చూసినా వాటిని ఏం చేయాలో తెలియలేదా? అనే సందేహాలు రాకమానవు. డిసెంబరు ఏడో తేదీ నాటికి కాంగ్రెస్ కొలువుదీరి ఏడాది పూర్తి కాబోతున్న స్థితిలో ఇంకా కమిటీలు, కాలయాపనలు అంటే జనంలో విశ్వసనీయతను తమంతట తాము తగ్గించుకున్నట్టే. గత పదేండ్లపాటు రాష్ట్రాన్ని పరిపాలించిన బీ(టీ)ఆర్ఎస్ ఆ కాలంలో ఒక్కటంటే ఒక్క రేషన్ కార్డు ఇవ్వకుండా పేదల సహనానికి పరీక్ష పెట్టింది. దీంతో ఆ కార్డు ప్రాతిపదికగా ఉన్న అనేక ప్రయోజనాలను వారు పొందలేకపోయారు. ఇప్పుడు రేవంత్ సర్కారు కూడా అదే రకమైన పోకడపోతే ప్రజల్లో అసంతృప్తి పెరగటం ఖాయం. కేసీఆర్ జమానాతో పోలిస్తే రాష్ట్రంలో ప్రజాస్వామిక వాతావరణం, ఆందోళనలు చేసుకునే హక్కు, ప్రజా ప్రతినిధులను, ఇంకా చెప్పాలంటే సాక్షాత్తూ ముఖ్యమంత్రినే కలిసేందుకు అపాయింట్మెంట్లు దొరకటం హర్షించదగ్గ విషయాలే. కానీ ప్రజా ప్రతినిధులను కలిసినంత ఈజీగా ప్రజల సమస్యలకు పరిష్కారాలు దొరక్కపోవటమే ఇబ్బంది కలిగిస్తోంది. ఇప్పటికిప్పుడు కాంగ్రెస్ కుర్చీని లాక్కుని, ఆ సీటు మీద తాను కూర్చోవాలన్నట్టు వ్యవహరిస్తున్న బీఆర్ఎస్ చెప్పినంత తీవ్ర స్థాయిలో కాకపోయినా అనేకానేక సమస్యలు రాష్ట్రంలో పేరుకుపోయాయి. గురుకులాల్లోని టీచర్లకు రెండు నెలలుగా వేతనాలు రాకపోవటం, పిల్లలకు నాణ్యమైన, పౌష్టికాహారం అందక పోవటం, మహిళల ఉచిత ప్రయాణానికి బస్సులు సరిపోక పోవటం, ఆస్పత్రుల్లో వైద్యులకు సరైన భద్రత లేకపోవటం, బదిలీల్లో సీనియర్లను జిల్లాలకు పంపించటం, అక్కడ సరైన మౌలిక వసతులు, సదుపాయాలు లేకపోవటం, 33 జీవో వల్ల వైద్య కళాశాలల్లో అడ్మిషన్లలో జాప్యం జరగటం వీటిలో ముఖ్యమైనవి. ఇవిగాకుండా రైతు రుణమాఫీ అసంపూర్ణం, రైతు భరోసా ఇంత వరకూ ఇవ్వకపోవటం, ఎన్నికల్లో హామీనిచ్చిన విధంగా సామాజిక పింఛన్లను పెంచకపోవటం, వ్యవసాయ కూలీలకు రూ. 12 వేల ఆర్థిక సాయం ముచ్చటే లేకపోవటం కూడా రేవంత్ సర్కార్ను అప్రదిష్ట పాల్జేస్తున్నాయి. ఇవన్నీ పేదలు, రైతులకు సంబంధించిన కీలకాంశాలు.. వారి సంక్షేమానికి చెందిన విషయాలు. ఆయా పథకాలు, కార్యక్రమాలను విస్మరిస్తే ఇబ్బందులు తప్పవనే విషయాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం గుర్తెరిగితే దానికే మంచిది.

# బిసి కాలనీ గణేషుని నిమజ్జనం



## -ఉత్సాహంగా విగ్నేశ్వరుని నిమర్జనం

## గ్రామంలోని అత్యధికంగా గణేష్ లడ్డు 1,0,2,000,/-

రంగారెడ్డి జిల్లా (నేటి శుభోదయ): రంగారెడ్డి జిల్లా తలకొండపల్లి మండలం వెల్జాల్ గ్రామంలో బిసి కాలనీ లో నెలకొల్పిన శ్రీ వర సిద్ధి వినాయక గణనాధుని నిమజ్జన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బీ.ఆర్.ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు సిఎల్, శ్రీనివాస్ యాదవ్ హాజరై గణేష్ కి ప్రత్యేక పూజలు నిర్వహించడం జరిగింది.విగ్నేశ్వరుని నిమజ్జన కార్యక్రమంలో భాగంగా కమిటీ సభ్యులు శ్రీనివాస్ యాదవ్ ని శాలువాతో సన్మానించడం జరిగింది.గణేష్ లడ్డు గన్నోజు రమేష్ కుటుంబ సభ్యులు 1,0,2000,/- ఒక లక్ష రెండు వేయిలకు వేలంపాటలో దక్కించుకోవడం జరిగింది. అశోక్ మాట్లాడుతు బిసి. కాలనీ లో 32 సంవత్సరాల నుండి నిర్వహిస్తున్న విఙ్ఞేశ్వరుడు ముల్లోకాలలో



ముందు పూజ అందుకుంటూ మానవాళికి ఆటంకం కలగకుండా విఘ్నాలు తొలగించే వినాయకుడి వినాయక చతుర్థి సందర్బంగా విగ్నేశ్వరుడు అందరినీ చల్లగా చూడాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నానని తెలిపారు.ఈ కార్యక్రమంలో శ్రీ వరసిద్ధి వినాయక కమిటీ సభ్యులు గ్రామ పెద్దలు,యువకులు, మహిళలు,చిన్నారులు,తదితరులు పాల్గొన్నారు.

# స్కిల్ యూనివర్సిటీ బోర్డు సమావేశంలో సీఎం రేవంత్ రెడ్డి కీలక నిర్ణయం



హైదరాబాద్ : తెలంగాణ యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ నిర్వహణ కోసం రూ. 100 కోట్లు కేటాయిస్తున్నట్లు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించారు. ఇవాళ సచివాలయంలో సీఎం ఆధ్వర్యంలో యూనివర్సిటీ బోర్డు సమావేశం జరిగింది. మంత్రి శ్రీధర్ బాబు, బోర్డు చైర్మన్ ఆనంద్ మహీంద్రా, కో-చైర్మన్ శ్రీనివాస సీ రాజు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, వివిధ రంగాల పారిశ్రామికవేత్తలు, ఉన్నతాధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. యూనివర్సిటీ పూర్తిస్థాయి నిర్వహణకు కార్పస్ ఫండ్ ఏర్పాటుకు ముందుకు రావాలని కోరారు. ఎవరికి తోచిన విధంగా వారు వివిధ రూపాల్లో యూనివర్సిటీ నిర్వహణకు సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు. మీటింగ్‌లో అధికారులు యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీకి సంబంధించి కీలక అంశాలను, ఈ ఏడాది నుంచే స్కిల్ యూనివర్సిటీలో ప్రారంభించే పలు కోర్సుల వివరాలను పారిశ్రామికవేత్తలకు అధికారులు వివరించారు.

రేవంత్‌రెడ్డి విజనరీ : ఆనంద్ మహీంద్రా

సమావేశానికి హాజరైన వర్సిటీ బోర్డు చైర్మన్ ఆనంద్ మహీంద్రా మాట్లాడుతూ.. తెలంగాణ నుంచి నైపుణ్యం కలిగిన యువతను ప్రపంచానికి అందించాలన్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆలోచన గొప్పదని ప్రశంసించారు. రేవంత్ విజన్ ఉన్న నాయకుడని, అందుకే యూనివర్సిటీ బోర్డు చైర్మన్‌గా ఉండాలని ఆయన కోరగానే ఒప్పుకున్నానని తెలిపారు.

## డిప్యూటీ సీఎం పవన్‌ను కలిసిన వైసీపీ మాజీ నేత.. వైఎస్ జగన్‌పై సంచలన వ్యాఖ్యలు



అమరావతి : :ఏపీలో వైఎస్సార్సీపీకి వరుస షాక్‌లు తగులుతున్నాయి. ఇప్పటికే పలువురు వైసీపీ కీలక నేతలు పార్టీని వీడి అధికార పార్టీలో చేరిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో తాజాగా మరో ఇద్దరు నేతలు జనసేన పార్టీలో చేరేందుకు సిద్ధమయ్యారు. ఈ నేపథ్యంలో బాలినేని శ్రీనివాస్ రెడ్డి నేడు(గురువారం) జనసేన అధినేత, డిప్యూటీ సీఎం పవన్‌ను కలిశారు. తాము జనసేన పార్టీలో చేరుతున్నట్లు ప్రకటించారు. ఈ క్రమంలో మాజీ సీఎం జగన్‌పై సంచలన విమర్శలు చేశారు. వైఎస్ జగన్‌కు విశ్వసనీయత లేదని, వైసీపీలో త్యాగాలు చేసిన వారికి న్యాయం జరగలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అంతేకాదు వైఎస్ జగన్‌ను గెలిపించాలని ఆనాడు రాజీనామాలు చేశామని గుర్తుచేశారు. కానీ ఇచ్చిన మాటను ఆయన మరిచిపోయారని ధ్వజమెత్తారు. సభల్లో జగన్ ఎప్పుడూ నా గురించి మాట్లాడలేదని వాపోయారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడూ పవన్ కళ్యాణ్ తన గురించి మాట్లాడారని ప్రశంసించారు. తనపై పవన్ ఎంతో అభిమానంతో ఉన్నారని కొనియాడారు. పవన్‌తో కలిసి పనిచేసేందుకు సిద్ధంగా ఉన్నామని తేల్చి చెప్పారు. తనతోపాటు కార్పొరేటర్లు, జడ్పీటీసీలు, ఎంపీటీసీలు కలిసి జనసేనలో చేరుతారని బాలినేని శ్రీనివాస్‌రెడ్డి ప్రకటించారు.

## శంషాబాద్ విమానాశ్రయానికి సీఐఐ జాతీయ అవార్డులు




శంషాబాద్ : కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీస్ (సీఐఐ) 2024 సెప్టెంబర్ 12న నిర్వహించిన 'ఎక్సలెన్స్ ఇన్ ఎనర్జీ మేనేజ్మెంట్' 25వ జాతీయ అవార్డు ప్రదానోత్సవంలో శంషాబాద్ అంతర్జాతీయ ఎయిర్?పోర్ట్? నేషనల్ ఎనర్జీ లీడర్', ఎక్సలెంట్ ఎనర్జీ ఎఫిషియెన్సీ యూనిట్' అవార్డులు అందుకుంది. వరుసగా ఆరవ సంవత్సరం నేషనల్ ఎనర్జీ లీడర్ అవార్డును, ఎక్సలెంట్ ఎనర్జీ ఎఫిషియెన్సీ యూనిట్ టైటిల్ ను ఎనిమిదోసారి గెలుచుకుంది. ఇది ఇంధన సామర్థ్యం, విమానయానంలో సుస్థిరత పట్ల దాని నిబద్ధతను హైలైట్ చేస్తుందని పేర్కొన్నారు. ఎయిర్?పోర్ట్? సీఈఓ ప్రదీప్ పణికార్ మాట్లాడుతూ రాజీవ్ గాంధీ హైదరాబాద్ ఇంటర్నేషనల్ ఎయిర్ పోర్ట్ లిమిటెడ్ ద్వారా నిర్వహించబడుతున్న ఆర్జిఐఏ దాని స్థిరమైన పద్ధతులు, కార్బన్ పాదముద్రను తగ్గించే ప్రయత్నాలకు గుర్తింపు పొందిందని, సుమారు 1.82 మిలియన్ యూనిట్ల గణనీయమైన శక్తి ఆదాను సాధించిందని అన్నారు. ఇది ఎయిర్ పోర్ట్స్ కౌన్సిల్ ఇంటర్నేషనల్ నుండి లెవల్ 4o న్యూట్రాలిటీ అక్రిడిటేషన్ కలిగి ఉన్న కార్బన్ న్యూట్రల్ ఎయిర్ పోర్ట్ కూడా నికర జీరో ఉద్గారాలను సాధించడానికి ఇంధన-సమర్థవంతమైన పద్ధతులను అవలంబించడానికి, సాంకేతికతలలో పెట్టుబడులు పెట్టడానికి ఆర్జిఐఏ నిబద్ధత సాధించిందని అన్నారు. ఈ విమానాశ్రయం టీజీఎస్ పీడీసీఎల్ నుండి 10 మెగావాట్ల సౌర విద్యుత్ ప్లాంట్, గ్రీన్ ఎనర్జీని ఉపయోగిస్తుంది. గ్రీన్ బిల్డింగ్ డిజైన్లు, పునరుత్పాదక ఇంధన వినియోగం, శక్తి నిర్వహణ పద్ధతులు, శక్తి ఆదా ప్రవర్తనలను ప్రోత్సహించడం వంటి వివిధ కార్యక్రమాలను అమలు చేస్తుందని పేర్కొన్నారు.

## జానీ మాస్టర్‌ను హైదరాబాద్‌కు తీసుకొస్తున్నాం.. అరెస్ట్‌పై పోలీసుల ప్రకటన



అమరావతి : ప్రముఖ కొరియోగ్రాఫర్ జానీ మాస్టర్ అరెస్ట్‌పై సైబరాబాద్ పోలీసులు గురువారం అధికారిక ప్రకటన విడుదల చేశారు. 'జానీ మాస్టర్‌ను గోవాలో అరెస్ట్ చేశాం. గోవా కోర్టులో హాజరుపర్చి పీటీ వారెంట్‌పై హైదరాబాద్‌కు తరలిస్తున్నాం. రేపు ఉప్పర్‌పల్లి కోర్టు లో జానీ మాస్టర్‌ను హాజరుపర్చుతాం. 2020లో జానీ లైంగికదాడి చేశాడని బాధితురాలు ఫిర్యాదు చేసింది. తాను మైనర్‌గా ఉన్నప్పుడే దాడి చేశాడని స్పష్టం చేసింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు జానీపై పోక్సోతో పాటు రేప్ కేసులు నమోదు చేశాం' అని ప్రకటనలో పోలీసులుకు జానీపై పోక్సోతో పో పాటు రేప్ కేసులు నమోదు చేశాం' అని ప్రకటనలో పోలీసు పేర్కొన్నారు. కాగా, జానీ మాస్టర్ వ్యవహారం రెండు రాష్ట్రాల్లో హాట్‌టాపిక్‌గా మారింది. ఈ కేసుపై ఇండస్ట్రీకి చెందిన పలువురు రకరకాలుగా స్పందిస్తున్నారు. అన్ని ఇండస్ట్రీలోనూ హేమ కమిటీ వంటి కమిషన్ ఉండాలని డిమాండ్ చేస్తున్నారు. మరోవైపు.. ప్రత్యేక బృందాలుగా విడిపోయి జానీ మాస్టర్ కోసం గాలించిన విషయం తెలిసిందే. చివరకు గోవాలో ఉన్నాడనే పక్కా సమాచారంతో వెళ్లి అరెస్ట్ చేశారు.

# 2లక్షల ఉద్యోగాలు, మహిళలకు నెలకు రూ.2,100.. బీజేపీ ఎన్నికల మేనిఫెస్టో విడుదల..



హర్యానా దంగల్ హీటెక్కిస్తోంది. హర్యానా అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తుండటంతో బీజేపీతోపాటు కాంగ్రెస్, ఆప్ ప్రచారంలో దూసుకెళ్తున్నాయి.. అంతేకాకుండా మాటల తూటాలు పేలుస్తూ హీటెక్కిస్తున్నాయి. హర్యానాలోని మొత్తం 90 స్థానాలకు అక్టోబర్ 5న ఎన్నికలు జరగనున్నాయి. 8న ఫలితాలు వెలువడనున్నాయి. ఈ తరుణంలో ఎలాగైనా మళ్లీ అధికారాన్ని దక్కించుకోవాలని బీజేపీ మాస్టర్ ప్లాన్ తో ముందుకు సాగుతోంది.. ఈ క్రమంలో అసెంబ్లీ ఎన్నికల కోసం బీజేపీ మేనిఫెస్టో విడుదల చేసింది. లాడ్లీ లక్ష్మీ యోజన పథకం కింద మహిళలకు నెలకు రూ.2,100 ఇస్తామని భారతీయ జనతా పార్టీ హామీ ఇచ్చింది. లాడ్లీ లక్ష్మీ పథకం నుంచి.. అగ్నివీర్ ఉద్యోగాల వరకు ఎన్నో హామీలనిచ్చింది. హర్యానా అసెంబ్లీ ఎన్నికల కోసం సంకల్ప పత్ర పేరిట.. భారతీయ జనతా పార్టీ (బిజెపి) అధ్యక్షుడు జెపి నడ్డా గురువారం రోహ్‌తక్‌లో పార్టీ మేనిఫెస్టోను విడుదల చేశారు. రాష్ట్రంలో రెండు లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు ఇస్తామని హామీ ఇచ్చారు. పార్టీ మేనిఫెస్టోను ఖచ్చితంగా అమలు చేస్తామని.. ఎన్నికల సమయంలో బీజేపీ ఇచ్చిన హామీలన్నింటిని తప్పకుండా నెరవేరుస్తుందని నడ్డా హామీనిచ్చారు.

బీజేపీ మెనిఫెస్టోలో కీల అంశాలు..

లాడ్లీ లక్ష్మీ యోజన పథకం కింద మహిళలకు నెలకు రూ.2,100 ఇస్తామని బీజేపీ హామీనిచ్చింది. ఖార్ఖోడాలో పారిశ్రామిక మోడల్ టౌన్‌షిప్ తరహాలో 10 పారిశ్రామిక నగరాల ఏర్పాటు హర్ ఘర్ గృహిణి యోజన కింద రూ. 500కే గ్యాస్ సిలిండర్ హర్యానాకు చెందిన ప్రతీ అగ్నివీర్‌కు కచ్చితంగా ప్రభుత్వ ఉద్యోగం. ఎస్సీ-ఎస్టీ, ఓబీసీ వర్గాలకు చెందిన హర్యానా విద్యార్థులకు దేశవ్యాప్తంగా ఏదైనా ప్రభుత్వ మెడికల్ లేదా ఇంజినీరింగ్ కాలేజీలో చదవడానికి స్కాలర్‌షిప్‌లు ఇస్తామని బీజేపీ హామీ ఇచ్చింది.


24 పంటలకు కనీస మద్దతు ధర కల్పన

పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో 5 లక్షల వరకు ఇళ్లు నిర్మిస్తామని బీజేపీ పేర్కొంది. ఇచ్చిన అన్ని హామీలను నెరవేర్చేందుకు బిజెపి ప్రభుత్వం కట్టుబడి ఉందని చెప్పింది.

గ్యారెంటీలతో కాంగ్రెస్..

కాగా.. కాంగ్రెస్ పార్టీ సైతం గ్యారెంటీలతో ప్రచారం ముమ్మరం చేసింది. కర్ణాటకలో ఐదు గ్యారంటీలు.. తెలంగాణలో ఆరు గ్యారంటీలు ప్రకటించి అధికారాన్ని చేజిక్కించుకున్న కాంగ్రెస్ పార్టీ%ా% అదే తరహాలో హర్యానా ప్రజలకు ఏడు గ్యారంటీలను ఇచ్చింది. ఆప్ కూడా పలు హామీలతో ప్రచారంలో దూసుకెళ్తోంది..

# 58 ఏళ్లు.. 13 ఎన్నికలు.. హర్యానాలో స్వతంత్ర అభ్యర్థులు కింగ్‌మేకర్‌లుగా ఎలా మారుతున్నారు..?



ఢిల్లీ :హర్యానా అసెంబ్లీ ఎన్నికలకు సమయం దగ్గర పడు తుండటంతో ప్రచారం ఊపందుకుంది. రాష్ట్రంలోని 90 అసెంబ్లీ స్థానాల్లో మొత్తం 1031 మంది అభ్యర్థులు తమ అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు. అందులో 462 మంది స్వతంత్ర అభ్యర్థులు బరిలో ఉన్నారు. కాంగ్రెస్, భారతీయ జనతా పార్టీ మధ్య హోరాహోరీ పోరుగా భావిస్తున్నప్పటికీ స్వతంత్ర అభ్యర్థుల ప్రవేశంతో పలు స్థానాల్లో ఆసక్తికర పోటీ నెలకొంది. రాష్ట్రంలో నాలుగు స్థానాల్లో స్వతంత్రులు ఆధిపత్యం చెలాయిస్తున్నారు. మరి ఇలాంటి పరిస్థితుల్లో ఈసారి అసెంబ్లీ ఎన్నికల్లో స్వతంత్రులు ఎలాంటి రాజకీయ విజయం సాధిస్తారో చూడాలి. హర్యానా పంజాబ్ నుండి ప్రత్యేక రాష్ట్రంగా అవతరించినప్పటి నుండి 58 సంవత్సరాల రాజకీయ చరిత్రలో, స్వతంత్రులు అనేక సందర్భాలలో కింగ్‌మేకర్‌ల పాత్రను పోషించారు. 1967 నుంచి 2019 వరకు మొత్తం 13 అసెంబ్లీ ఎన్నికలు జరగ్గా, ప్రతిసారీ స్వతంత్రులు తమ ఉనికిని నమోదు చేసుకున్నారు. ఇప్పటి వరకు జరిగిన ఎన్నికల్లో 117 మంది స్వతంత్ర ఎమ్మెల్యేలు ఎన్నికయ్యారు. అంటే ప్రతి అసెంబ్లీ ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థులు అసెంబ్లీలో అడుగుపెట్టారు. ఈ సారి కూడా స్వతంత్ర అభ్యర్థుల మద్దతుతో పలువురు సీనియర్ నేతలకు సీట్లు దక్కకపోవడానికి ఇదే కారణం.హర్యానాలో 1967 నుండి 2019 వరకు 13 సార్లు ఎన్నికలు జరిగాయి. ప్రతి ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థుల తమ సత్తా చాటారు. 1967 అసెంబ్లీ ఎన్నికల్లో 16 మంది ఎమ్మెల్యేలు స్వతంత్రులుగా ఎన్నికయ్యారు. ఆ తర్వాత 1968లో 6 మంది ఎమ్మెల్యేలు, 1972లో 11 మంది ఎమ్మెల్యేలు, 1977లో 7 మంది స్వతంత్ర ఎమ్మెల్యేలు గెలిచారు. ఆ విధంగా, 1972 వరకు ఏ మహిళా స్వతంత్ర ఎమ్మెల్యే ఎన్నిక కాలేదు. కానీ 1982లో మొదటిసారిగా శారదా రాణి బల్లాబ్‌గఢ్ స్థానం నుంచి స్వతంత్ర అభ్యర్థిగా గెలుపొందారు. గతంలో కాంగ్రెస్ నుంచి మూడుసార్లు ఎమ్మెల్యేగా గెలిచినా, 1982లో కాంగ్రెస్ ఆమెకు టికెట్ ఇవ్వకపోవడంతో స్వతంత్ర అభ్యర్థిగా బరిలోకి దిగి విజయం సాధించారు.1982 అసెంబ్లీ ఎన్నికల్లో 16 మంది స్వతంత్ర ఎమ్మెల్యేలు ఎన్నికయ్యారు. దీని తర్వాత 1987లో 7 మంది ఎమ్మెల్యేలు, 1991లో 5 మంది స్వతంత్ర ఎమ్మెల్యేలు గెలిచారు. 1996లో 10 మంది స్వతంత్రులు ఎమ్మెల్యేలు అయ్యారు. ఈ విధంగా 2000 సంవత్సరంలో 11 మంది ఎమ్మెల్యేలు, 2005లో 10 మంది ఎమ్మెల్యేలు, 2009లో 7 మంది ఎమ్మెల్సీలు, 2014లో 5 మంది ఎమ్మెల్సీలు, 2019లో 7 మంది స్వతంత్ర ఎమ్మెల్యేలు ఎన్నికై అసెంబ్లీకి చేరుకున్నారు. ఇప్పటివరకు, హర్యానాలో మొత్తం 117 మంది స్వతంత్ర ఎమ్మెల్యేలు ఎన్నికయ్యారు. అయితే వారు కూడా చాలా సందర్భాలలో కీలక పాత్రలు పోషించారు.హర్యానా రాజకీయాల్లో చాలా సార్లు స్వతంత్రుల సహాయంతో ప్రభుత్వాలు ఏర్పడ్డాయి. 2009లో ఏడుగురు స్వతంత్ర ఎమ్మెల్యేల సహకారంతో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటైంది.

అంతకుముందు 1982లో భజన్ లాల్ కూడా స్వతంత్ర ఎమ్మెల్యేల బలంతో అధికారంలోకి వచ్చారు. 1982లో స్వతంత్రులుగా గెలిచిన 16 మంది ఎమ్మెల్యేలలో భజన్‌లాల్ తన మంత్రివర్గంలో ఐదుగురు స్వతంత్రులను మంత్రులను చేశారు. అలాగే, 2019 అసెంబ్లీ ఎన్నికల్లో కూడా 7 మంది స్వతంత్ర ఎమ్మెల్యేలు గెలుపొందగా, వారిలో 6 మంది బీజేపీకి మద్దతు పలికారు. ఆ తర్వాతే బీజేపీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. అటువంటి పరిస్థితిలో, రాణియా నుండి స్వతంత్ర ఎమ్మెల్యేగా ఎన్నికైన రంజిత్ సింగ్‌ను బీజేపీ కేబినెట్ మంత్రిగా చేసింది.హర్యానా ఏర్పడిన తర్వాత 1967, 1987లో 16-16 మంది స్వతంత్ర ఎమ్మెల్యేలు ఎన్నికయ్యారు. 2014, 1991లో అత్యల్ప సంఖ్యలో స్వతంత్రులు 5-5 గెలుపొందారు. ఇలాంటి పరిస్థితుల్లో ఇండిపెండెంట్లుగా అసెంబ్లీకి చేరిన వారిలో రెబల్ నేతలను మాత్రమే చేర్చుకోవడం, ఎవరికి టిక్కెట్లు దక్కకపోవడమో, లేక అభ్యర్థులుగా నిలవకపోవడమో జరిగితే స్వతంత్రులుగా పోటీ చేయడం విశేషం. 2019 అసెంబ్లీ ఎన్నికల సమయంలో రెబెల్స్ బీజేపీ, కాంగ్రెస్‌లకు చుక్కలు చూపించారు. బీజేపీ కేవలం 40 సీట్లు మాత్రమే పొందగలిగింది. అందుకే బలవంతంగా స్వతంత్రులను ప్రభుత్వంలో చేర్చుకుంది.ఈసారి కూడా పలువురు స్వతంత్ర ఎమ్మెల్యేలు పోటీలో ఉన్నారు. టికెట్ రాకపోవడంతో అనిల్ విజ్ రెండుసార్లు స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసి సొంత పార్టీ అభ్యర్థులను ఓడించారు. అనిల్ విజ్ 1996, 2000 అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధించారు. అదేవిధంగా, భీమ్‌సేన్ మెహతా ఇంద్రి నుండి స్వతంత్ర అభ్యర్థిగా నాలుగు సార్లు ఎన్నికల్లో పోటీ చేశారు. 1996, 2000లో కేబినెట్ మంత్రిగా కూడా పనిచేశారు. స్వతంత్రులు కూడా పార్టీల మధ్య సమీకరణాలను సృష్టించారు. 2009లో భూపేంద్ర సింగ్ హుడా ప్రభుత్వంలో స్వతంత్రులకు మంత్రి పదవులు లభించాయి. హుడా గోపాల్ కందాకు హోం శాఖ సహాయ మంత్రి హోదా కూడా ఇచ్చారు. అలాగే ఓంప్రకాష్ జైన్, సుఖ్‌బీర్ కటారియా, పండిట్ శివ చరణ్‌లకు కూడా మంత్రి పదవులు దక్కాయి. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్, బీజేపీల నుంచి పలువురు స్వతంత్ర అభ్యర్థులు బరిలో నిలవడంతో వీరి ఎంట్రీ పోటీని ఆసక్తికరంగా మార్చింది.

# సుందరకాండ టీజర్.. నారా రోహిత్ ఈసారి కామెడీగా..




ఇండస్ట్రీలో విభిన్నమైన కథలతో ఆడియెన్స్ లో మంచి గుర్తింపు అందుకున్న అతికొద్ది మంది హీరోలలో నారా రోహిత్ ఒకరు. అతను ఎలాంటి సినిమా చేసినా కూడా అందులో ఏదో ఒక డిఫరెంట్ పాయింట్ ఉంటుంది అని చెప్పవచ్చు. ఇక ఇప్పుడు తన 20వ చిత్రంగా ప్రేక్షకుల ముందుకు రాబోతున్న సుందరకాండ టీజర్ ఇటీవల విడుదలైంది. ఈ సినిమాను వేంకటేష్ నిమ్మలపూడి దర్శకత్వంలో తెరకెక్కిస్తున్నారు. సంతోష్ చినపొల్ల, గౌతమ్ రెడ్డి, రాకేష్ మహంకల్లి సంయుక్తంగా సందీప్ పిక్చర్ ప్యాలెస్ పతాకంపై నిర్మిస్తున్నారు. టీజర్‌తోనే సినిమా పై మంచి ఆసక్తి కలిగించారు. సుందరకాండలో నారా రోహిత్ సిద్దార్థ్ అనే పాత్రలో కనిపించనున్నారు. పెళ్లి చేసుకునేందుకు సరైన అమ్మాయిని వెతికే అతను కొన్ని ప్రత్యేకమైన లక్షణాలున్న జీవిత భాగస్వామి కావాలని ఆశపడుతుంటాడు. అయితే వివాహయోగ్యంలో ఉండి పెళ్లి కాకపోవడం వల్ల సమాజం నుంచి వచ్చే ఒత్తిడిని, తన తల్లిదండ్రులకు భారంగా ఉన్నట్టు అనిపించే పరిస్థితులను ఎదుర్కొంటాడు. ఈ నేపథ్యంతో తెరకెక్కిన ఈ కథలో రోహిత్ పాత్ర వినోదాన్ని పంచుతుందని టీజర్ స్పష్టం చేస్తోంది. సిద్దార్థ్ పాత్రలో రోహిత్ సరైన టైమింగ్‌తో కామెడీ పండిస్తున్నాడు. ఈ పాత్ర నారా రోహిత్ కు కరెక్ట్ గా సెట్టయినట్లు టీజర్ ద్వారా తెలుస్తోంది. ప్రధాన కథానాయికగా వృతీ వాఘని నటిస్తుండగా, శ్రీ దేవి విజయకుమార్ ఈ సినిమాతో తిరిగి వెండితెరపై కనిపించనున్నారు. మరోవైపు సీనియర్ నరేశ్ తండ్రి పాత్రలో కనిపించగా, వాసుకి ఆనంద్ కూడా కీలక పాత్ర పోషిస్తున్నారు. టీజర్ లో చూపించినట్టుగా, సినిమా మంచి ఎంటర్టైన్మెంట్ తో రాబోతున్నట్లు తెలుస్తోంది. దర్శకుడు వేంకటేష్ నిమ్మలపూడి సినిమాను పూర్తిగా వినోదభరితంగా తీర్చిదిద్దినట్లు కనిపిస్తోంది. ప్రదీప్ ఎం వర్మ సినిమాటోగ్రఫీ రంగురంగుల విజువల్స్‌తో ఆకట్టుకుంటోంది. లియోన్ జేమ్స్ బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ వినోదాన్ని మరింత ఎలివేట్ చేస్తోంది. రోహన్ ఈ సినిమాకు ఎడిటర్‌గా, రాజేష్ పెంటకోట ఆర్ట్ డైరెక్టర్‌గా పనిచేస్తున్నారు. నారా రోహిత్ ఈ మధ్య గ్యాప్ ఇచ్చినప్పటికీ మంచి కంటెంట్ తోనే ఆడియెన్స్ ముందుకు వస్తున్నట్లు తెలుస్తోంది. ఇంతకుముందు అతను మంచి సందేశాత్మక సినిమాలు కూడా చేశారు. ఇప్పుడు మరో విభిన్నమైన కథతో ఎట్రాక్ట్ చేసేందుకు రెడీ అయ్యాడు. మరి సుందరకాండ సినిమా బాక్సాఫీస్ వద్ద ఎలాంటి మ్యాజిక్ ను క్రియేట్ చేస్తుందో చూడాలి.



# రమ్య.. మచ్చలేని చందమామ




తెలుగమ్మాయిలని కరెక్ట్ గా రిప్రజెంట్ చేయాలేగాని కచ్చితంగా టాలీవుడ్ ఇండస్ట్రీని షేక్ చేసే రేంజ్ లో చాలా మంది ఉన్నారు. ఒకప్పుడు తెలుగు రాష్ట్రాల నుంచి నటిగా కెరియర్ ఎంచుకునే బ్యూటీస్ చాలా తక్కువ మంది ఉండేవారు. అయితే ఈ మధ్యకాలంలో మాత్రం చాలా మంది యంగ్ బ్యూటీస్ మేమెందులో కూడా తక్కువ కాదు అంటూ పోటీ పడుతున్నారు. అందం, అభినయంతో ఆకట్టుకునే ప్రయత్నం చేస్తున్నారు. గ్లామర్ షోకి సైతం మేము సిద్ధం అంటున్నారు. అలాంటి గ్లామరస్ బ్యూటీస్ లలో హీరోయిన్ గా ఒక్కో మెట్టు ఎక్కుతోన్న అందాల భామ రమ్య పసుపులేటి. ఈ అమ్మడు తాజాగా రిలీజ్ అయిన మారుతీనగర్ సుబ్రహ్మణ్యం సినిమాలో హీరోయిన్ గా మెరిసింది. తన అందంతో మూవీలో అందరిని ఆకట్టుకుంది. సినిమాకి కూడా పాజిటివ్ టాక్ రావడంతో రమ్య పేరు ఇప్పుడు గట్టిగానే వినబడుతోంది. హుషారు సినిమాతో హీరోయిన్ గా కెరియర్ స్టార్ట్ చేసిన రమ్య పసుపులేటి తరువాత ఫస్ట్ ర్యాంక్ రాజు, మైల్స్ ఆఫ్ లవ్, కమిట్ మెంట్ సినిమాలలో నటించింది. అయితే ఈ సినిమాలు రమ్యకి ఆశించిన స్థాయిలో గుర్తింపు తీసుకురాకపోయిన మారుతీనగర్ సుబ్రహ్మణ్యం మాత్రం హీరోయిన్ గా కొంత బ్రేక్ ఇచ్చిందని చెప్పొచ్చు. నెక్ట్స్ మెగాస్టార్ చిరంజీవి విశ్వంభర సినిమాలో రమ్య పసుపులేటి నటిస్తోంది. ఈ సినిమాలో చిరంజీవి చెల్లెలుగా ఆమె పాత్ర ఉండబోతోంది. సినిమాలతో పాటుగా చదరంగం, బిఎఫ్ఎఫ్ వెబ్ సిరీస్ లలో రమ్య పసుపులేటి నటించింది. ఇదిలా ఉంటే ఈ అమ్మడు ఇన్ స్టాగ్రామ్ లో చాలా యాక్టివ్ గా ఉం టుంది. రెగ్యులర్ గా గ్లామర్ పిక్స్ ని ఇన్ స్టాగ్రామ్ లో షేర్ చేస్తుంది. ఈ ఫోటోలకి నెటిజన్ల నుంచి పాజిటివ్ రెస్పాన్స్ వస్తూ ఉంటాయి. రమ్య అందానికి చాలా మంది ఫిదా అయిపోతూ ఉంటారు. తాజాగా మారుతీనగర్ సుబ్రహ్మణ్యం మూవీ ఈవెంట్ లో రమ్య పసుపులేటి లంగా ఓణీలో రమ్య పసుపులేటి సందడి చేసింది. ఈ ఫోటోలు ఇన్ స్టాగ్రామ్ లో వైరల్ అవుతున్నాయి. చక్కనైన ట్రెడిషనల్ కాస్ట్యూమ్స్ లో అందాల అరవిందంలా రమ్య పసుపులేటి మెరిసిపోతుందనే మాట వినిపిస్తోంది. ఈ ఫోటోస్ ని రమ్య ఫ్యాన్స్ సోషల్ మీదకిలో షేర్ చేస్తున్నారు. చక్కనైన చిరునవ్వుతో కుందనాల బొమ్మలా రమ్య అందం ఉందనే ఉందని నెటిజన్లు కామెంట్స్ చేస్తున్నారు.





# సన్నీలియోన్ స్టన్నింగ్ ఫోటోషూట్





పెద్ద తెర నుంచి కొన్నాళ్లుగా దూరంగా ఉన్న సన్నీలియోన్ తన సోషల్ మీడియాల్లో నిరంతరం అభిమానులకు టచ్ లో ఉంది. అక్కడ వేడెక్కించే ఫోటో/ వీడియో ట్రీట్ కి కొదవేమీ లేదు. కొంత కాలంగా సన్నీలియోన్ కొన్ని వ్యక్తిగత కారణాలతో ఫుల్ జోష్ లో కనిపిస్తోంది. ఈ ఏడాది సన్నీలియోన్‌కి క్షణం తీరిక లేనంత షెడ్యూల్ ఉంది. తనూజ్ విర్వానీతో కలిసి డేటింగ్ రియాలిటీ షో ఎంటివి స్ప్లిట్స్‌విల్లా %శ%5 తో ఓవైపు బిజీ బిజీ. మరోవైపు ఉపేంద్రతో కలిసి కన్నడ చిత్రం యుఐ చిత్రీకరణలోను బిజీ. వరుస ప్రాజెక్టులు క్యూలో ఉన్నాయి. ఇంతటి బిజీ షెడ్యూల్ నడుమ సన్నీలియోన్ ఇటీవల విమానాశ్రయంలో కనిపించింది. అక్కడ స్టిల్ ఫోటోగ్రాఫర్లతో తన సోదరుడి బిడ్డ రాక గురించి శుభవార్తను షేర్ చేస్తూ చాలా ఉత్సాహంగా కనిపించింది. %-%మేరే భాయ్ కా చోటా బేబీ అయా%-% అంటూ హిందీ మాండలికం మిస్ అవ్వకుండా చెప్పేందుకు ప్రయత్నించింది. త్వరలోనే స్వీట్లు పంచుతానని కూడా చెప్పి అక్కడి నుంచి వెళ్లిపోయింది.ఇంతలోనే సన్నీ అగ్గి రాజేసే ఫోటోషూట్ ని ఇన్ స్టాలో షేర్ చేసింది. శృంగార తార సన్నీలియోన్ గ్రీన్ అండ్ గ్రీన్ కాంబినేషన్ లుక్ లో కనిపించింది. మత్తెక్కించే ఎద అందాలను ఎలివేట్ చేస్తూ గ్రీన్ కలర్ లాంగ్ ఫ్రాక్ ని ధరించిన సన్నీలియోన్ దానిపై డార్క్ గ్రీన్ బ్లేజర్ ని ధరించి స్పెషల్ గా కనిపించింది. హితేంద్ర కపూరా ఈ లుక్ కి స్టైలింగ్ చేసారు. ప్రస్తుతం ఈ అందమైన ఫోటోషూట్ ఇంటర్నెట్ లో వైరల్ గా మారుతోంది. అలాగే సన్నీలియోన్ సోదరుడు సందీప్ వోహ్రా తన భార్య కరిష్మా, బిడ్డతో కలిసి ఉన్న ఫోటోలు కూడా ఇప్పుడు ఇంటర్నెట్ లో దూసుకెళుతున్నాయి. కెరీర్ పరంగా చూస్తే... సన్నీ లియోన్ కన్నడ చిత్రం యుఐ లో నటిస్తోంది. ఆమెతో పాటు ఈ చిత్రంలో మురళీ శర్మ, అష్రఫ్, ఉపేంద్ర, పి రవిశంకర్, అచ్యుత్ కుమార్, సాధు కోకిల, నిధి సుబ్బయ్య కూడా ముఖ్య పాత్రల్లో నటిస్తున్నారు. ఈ చిత్రాన్ని సెప్టెంబర్ 18న థియేటర్లలోకి తీసుకురావడానికి ప్లాన్ చేస్తున్నారు.



# ఆయేషా ఖాన్.. చీరలో ఆ వయ్యారం అదరహో..



అందం, అభినయం, హాట్ ప్రెజెన్స్ తో టాలీవుడ్ లో విభిన్నమైన గుర్తింపు తెచ్చుకుంటున్న కొత్త తరం తారగా ఆయేషా ఖాన్ నిలుస్తోంది. బాలీవుడ్ లో మొదటగా తెరంగేట్రం చేసినప్పటికీ, తెలుగు ప్రేక్షకులకు దగ్గర కావడం ఆమెకు కొత్త ఊపు ఇచ్చింది. మొదట్లో చేసిన కొన్ని సినిమాలు ఆమెకు ఆశించినంత పేరును ఇవ్వకపోయినా, సోషల్ మీడియా వేదికగా ఆమె తన ప్రత్యేకతను చాటుకుంటోంది. ఇన్ స్టాగ్రామ్, ట్విట్టర్ లాంటి ప్లాట్‌ఫారమ్‌లలో ఆమె తరచూ యాక్టివ్ గా ఉంటూ, తన లేటెస్ట్ ఫోటోషూట్లను పంచుకుంటూ అభిమానులను అలరిస్తుంది. ఆయేషా ఖాన్ తన అందంతో పాటు గ్లామర్ చూపుల ద్వారా ప్రేక్షకులను కట్టిపడేస్తోంది. ఇటీవలే షేర్ చేసిన ఫొటోలలో అదిరిపోయే లుక్స్ తో నెటిజన్లను కట్టిపడేస్తోంది. చీరలో సింపుల్ హెయిర్ స్టైల్ లో ఉండి సాఫ్ట్ లుక్స్ తో ఆమె ఇచ్చిన ఫోజులు ఫ్యాన్స్ ను మంత్ర ముగ్ధులను చేశాయి. సాధారణంగా ఎప్పటికప్పుడు ట్రెండింగ్ ఫ్యాషన్ ఫోటోలు షేర్ చేయడం, విభిన్న లుక్ లలో కనిపించడం ఆమె ప్రత్యేకత. సోషల్ మీడియాలో మాత్రమే కాకుండా, ఫిల్మ్ ఇండస్ట్రీలో కూడా మంచి అవకాశాలను దక్కించుకుంటున్న ఆమె, కొన్ని ప్రాజెక్ట్స్ లో చిన్న పాత్రలు చేయడం ద్వారా తక్కువ సమయంలోనే మంచి పేరు తెచ్చుకుంది. టాలీవుడ్ లో ఆమె ప్రత్యేక ఫ్యాన్ బేస్ ఏర్పడడం వల్ల, రాబోయే కాలంలో మరిన్ని భారీ ప్రాజెక్ట్స్ లో అవకాశం రాబోతోందని నిపుణులు అంచనా వేస్తున్నారు. ఆయేషా ఖాన్ తన కెరీర్ ప్రారంభం చేసినప్పట్నుంచి ఆరడుగుల అందం, వెరైటీ ఫ్యాషన్ సెన్స్ తో ప్రేక్షకుల మనసులు గెలుచుకుంటోంది. సినిమాల్లో హీరోయిన్ పాత్రలు కాకపోయినా, ప్రత్యేక సాంగ్స్, సైడ్ రోల్స్ తో మంచి గుర్తింపు తెచ్చుకుంటోంది. బిగ్ బాస్ హిందీ సీజన్-17 లో కూడా తన విశిష్టమైన ప్రెజెన్స్ చూపిస్తూ, ప్రేక్షకులను ఆకట్టుకోవడం ద్వారా తన గుర్తింపుని మరింత బలపరిచింది. సినిమాల్లో సరైన బ్రేక్ వస్తే, ఆమె తెలుగులో మరింత మెరుగైన అవకాశాలు పొందాలని ఆమె అభిమానులు ఆశిస్తున్నారు. ప్రస్తుతం దుల్కర్ సల్మాన్ లాంటి స్టార్ హీరోలతో ఆమెకు అవకాశం దక్కడం, ఆమె కెరీర్ కు కొత్త దిశగా మారే అవకాశాలు ఉన్నట్లు కనిపిస్తున్నాయి.

Printed Published and owned by Gongura Srinivas Rao, Printed at M R Publications, # 6-3-1880, Vanasthalipuram, Ranga Reddy (Dist), Telangana 500070. at H.No 8-7-12/671, Sai Colony, Madhuban Colony, Rajendranagar, Ranga Reddy District, Telangana-500077, Editor: Gongura Srinivas Rao RNI Title Code :- TELTEL12296